ప్రజాశక్తి
బుధవారం 21 ఫిబ్రవరి 2024

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

# ఆర్థిక బకాయిల కోసం ఆందోళన ఉధృతం

**- 27న ఛలో విజయవాడ వేలాదిగా తరలిరండి - ఎపి జెఏసి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ,ధర్నా - సిఐటియు సంపూర్ణ మద్దతు**

**ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్**

ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఆర్థికపరమైన బకాయిల కోసం మంగళవారం జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు వేలాదిమంది ఉద్యోగులతో నిరసన ప్రదర్శన చేశారు. ఎపి జెఏసి రాష్ట్ర కార్యదర్శి హృదయరాజు కర్నూలు జెఏసి చైర్మన్ విసిహెచ్.వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల పెన్షనర్ల ఆర్థికపరమైన డిమాండ్లు సాధించేంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని అంతేకాక 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని లక్షలాది ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల, పెన్షనర్లతో చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థికపరమైన డిమాండ్లు 100 నెలల కరువు బత్యం బకాయిలు, పెండింగులో ఉన్న పెండింగులో ఉన్న జిపిఎఫ్ రుణాలు, ఎపిజిఎల్ఐ రుణాలు, మూడేళ్ల నుంచి పెండింగులో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, రెండు డిఎ బకాయిలు, పెన్షనర్ల సమస్యలు ఉద్యోగులపై భౌతిక దాడులను అరికట్టాలి, 12వ పిఆర్‌సి ఆలస్యం అవుతున్నందున వెంటనే 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని, ఈ డిమాండ్లపై వెంటనే రాష్ట్ర జెఏసి నాయకత్వంతో ప్రభుత్వం చర్చించాలని, లేనియెడల చలో విజయవాడ కార్యక్రమం లక్షలాది మందితో చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ర్యాలీలో సిఐటియు ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ ,ప్రధాన కార్యదర్శి అంజిబాబు, ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేదక సిఐటియు సంపూర్ణ మద్దతుగా ఉంటుందని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా నాయకులు జయరాజు మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల ,సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ అనేక పోరాటాలు చేసిందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయకుంటే ఖచ్చితంగా తగిన బుద్ధి చెప్తారన్నారు. ఇప్పటికే ఉద్యోగులను రోడ్లమీద పెట్టిన ఏకైక ప్రభుత్వం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి , ఎపిజెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్లాల్, నగర చైర్మన్ ఎంసి.కాశన్న, ఆర్‌టిసి నేషనల్ మద్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిసి.శంకర్ నాయక్ , ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కరుణాకర్, వెటర్నరీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఇస్మాయిల్, రామకృష్ణ, సేవ్యానాయక్, రామచంద్ర, గోకారి, రవి కుమార్, సురేష్, జనార్దన్, ప్రకాష్ , ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్ రావు, ఎఇఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష, ఆర్అండ్‌బి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రమణ , కర్నూలు జిల్లా ఎన్‌జిఒ నాయకులు , ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 తాలూకాల జెఏసి అధ్యక్ష కార్యదర్శులు, వారి నాయకత్వంతో , కర్నూలు జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లు వేలాదిగా ర్యాలీలో పాల్గొన్నారు.

ధర్నా చేపడుతున్న జెఏసి నాయకులు

## ఉద్యోగ, కార్మికులకు
# అండగా ఉంటాం

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయి**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

ఉద్యోగ, కార్మికులకు సిఐటియు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయి తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఒపిఎస్‌ను కొనసాగించాలని ప్రభుత్వ ఉద్యోగుల జెఏసి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన సాగింది. ప్రదర్శన అనంతరం జరిగిన సభ సందర్భంగా సిఐటియు నాయకులు వారికి మద్దతు తెలిపారు. అనంతరం కార్మిక, కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగులు, స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు ఆందోళన బాట పట్టారని తెలిపారు. ఆందోళనలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ సిఐటియు ఎల్లవేళలా అండగా ఉంటూ మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. 42 రోజులు జరిగిన అంగన్వాడీ ఉద్యోగుల సమ్మెకు, 17 రోజులు జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మెకు సిఐటియు నాయకత్వం వహించి నిర్వహించిందని తెలిపారు. సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై సిఐటియు అండగా నిలిచిందని చెప్పారు. ఆశావర్కర్లు నిర్వహించిన మిలిటెంట్ ఉద్యమాలకు సిఐటియు అండగా నిలబడిందని తెలిపారు. తప్పనిసరి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి కొంతలో కొంత డిమాండ్లు ఒప్పుకోవాల్సిన పరిస్థితి సిఐటియు కల్పించిందని చెప్పారు. ఆందోళన బాట పట్టిన ప్రతి ఒక్కరి పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విధుల్లో ఉన్న వారిని సైతం పోలీసు స్టేషన్లకు రప్పించి ఆందోళనలో పాల్గొనకుండా వారి హక్కులను కాలురాస్తోందని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో సిఐటియు పోరాడుతుందని తెలిపారు. న్యాయమైన తమ డిమాండ్ల కోసం కార్మికులు ఆందోళన చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించకపోగా వారి పోరాటాల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు ఎండగట్టాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ఈరన్న, సాయిబాబా, విజయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా..?

పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**- ఈనాడు కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం**
**- దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన సిపిఎం బృందం**

**ప్రజాశక్తి - కర్నూలు క్రైం**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేక రౌడీలు రాజ్యమేలుతున్నారో అర్థం కావడం లేదని సిపిఎం నాయకులు విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడి అరాచకత్వాన్ని తలపిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, ఎమ్‌డి.ఆనంద్ బాబు, నగర నాయకులు కె.రామకృష్ణ, ఎన్‌జి.కృష్ణ విమర్శించారు. దాడికి గురైన ఈనాడు కార్యాలయ పరిసర ప్రాంతాలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పత్రికలో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకుని ప్రజాస్వామ్య యుతంగా ఆందోళన చేయవచ్చు కానీ, అనుచర గుంపుతో దాడి చేయడం అనేది పాశవిక చర్య అని విమర్శించారు. వార్త సరైనది కాకపోతే, పరువు నష్టం పేరుతో కోర్టుకు వెళ్లవచ్చని, దాడి చేయడం అనేది చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడమేనని తెలిపారు. లేని రాజకీయాన్ని పత్రిక విలేకరులపై పులిమి భౌతిక దాడులకు తెగబడడం సరైంది కాదన్నారు. దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని, దాడులకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలకు సంపూర్ణ సంఘీభావాన్ని వారు ప్రకటించారు.

# వైఎస్ఆర్ కల్యాణమస్తు కింద రూ.4.03 కోట్లు విడుదల

**- కలెక్టర్ డాక్టర్ సృజన**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ద్వారా జిల్లాలో 494 మందికి రూ.4.03 కోట్ల లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. మంగళవారం వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ఆర్థిక సహాయాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ సృజన, జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకం కింద 5వ విడతలో అక్టోబర్ నుంచి డిసెంబర్ 2023 త్రైమాసికంలో నూతనంగా వివాహం చేసుకున్న మొత్తం 494 మంది లబ్ధిదారులు లబ్ధి పొందారని తెలిపారు. బీసీలు - 208 (ఒక్కటే కులం - 198, కులాంతర వివాహం - 7), వికలాంగులు - 3, మైనారిటీస్ - 116 (ఒక్కటే కులం - 113, కులాంతర వివాహం - 3), ఎస్సీ - 155 (ఒక్కటే కులం - 147, కులాంతర వివాహం - 8), ఎస్టీ - 9 మంది లబ్ధి పొందారన్నారు. ఇప్పటి వరకు 5 విడతల్లో 2,952 మందికి రూ.23.71 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు రూ.4.03 కోట్ల మెగా చెక్కును కలెక్టర్, జడ్‌పి చైర్మన్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్, డిసిఎంఎస్ చైర్మన్ తదితరులు అందజేశారు. డిఆర్‌డిఎ పీడీ సలీమ్ బాషా, డిఆర్‌డిఎ ఏపీడీ శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి రంగలక్ష్మి దేవి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి శ్రీనివాస్ కుమార్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సృజన, జడ్‌పి చైర్మన్ పాపిరెడ్డి

## జిజిహెచ్‌లో న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ప్రారంభం

**- ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ సృజన**

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

కర్నూలు ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ విభాగంలో నూతన న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కలెక్టర్ డాక్టర్ జి.సృజన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో 10 పడకల న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు ఇందులో అత్యాధునిక వైద్య సదుపాయాలైన వెంటిలేటర్లు, డిఫిబ్లేటర్స్, మానిటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పక్షవాతం వచ్చిన రోగులకు కాలు, చేతులు, ముఖం వంకర పోయిన వారికి ఈ ఆధునిక సౌకర్యాలతో వైద్యం లభించడం వల్ల వారు వెంటనే కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సదుపాయం రాష్ట్రంలోనే మొట్టమొదట కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, కార్డియో తొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, న్యూరాలజీ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి, న్యూరాలజీ విభాగం డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

మాట్లాడుతున్న చింతలమోహన్‌రావు

## కాంగ్రెస్ వైపు చూస్తున్నారు : సి మోహన్‌రావు

**ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో అంట కాగుతున్న వైసిపి టిడిపి పార్టీలను ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ వైపు ప్రజలు చూస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సమావేశంలో చింతల మోహన్ రావు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఊహించని స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆశా భావం వ్యక్తం చేశారు. అలాగే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో ప్రజలలో కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం పెరిగిందన్నారు. బిజెపి ప్రభుత్వంపై విసిగిపోయిన దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని జిల్లాస్థాయిలో పోలింగ్ బూత్‌ల వారీగా బూత్ కమిటీలు పూర్తి చేయాలని ఆయన పార్టీ నేతలను కోరారు. మాజీమంత్రి మూలింటి మారెప్ప పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న డిసిసి ఉపాధ్యక్షులు బి.బతుకన్న, ఎ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ నవీద్ కె. సత్యనారాయణ గుప్త, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్ మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.ప్రమీల పాల్గొన్నారు.

## ఈ పొట్టేలు బరువు 60 కిలోలు

**ప్రజాశక్తి సి బెళగల్**



ఈ ఫొటోలో కనిపిస్తున్న పొట్టేలు 60 కిలోల బరువు,, ధర అరవై వేలు అంటే ఆశ్చర్యంగా ఉంది. మండలంలోని చింతమాను పల్లెకు చెందిన రైతు వెంకటేశ్వర్లు గత రెండేళ్ల క్రితం దేవర కోసమని ఈ పొట్టేలును 13 వేలకు తెచుకొన్నారు. పెంపకంలో దాని బరువుతో పాటు ధర పలుకుతుండటంతో ఆశ్చర్యంగా ఉందని రైతు అన్నారు. నేడు గ్రామంలో దేవర సందర్భంగా మాకు, మా బంధువులకు సరిపపోతుందన్నారు.

**కొత్తకోటలో సురక్షకు 402 మంది హాజరు**

**సి బెళగల్ :** మండలంలోని కొత్తకోటలో వైద్యులు సునీత, వాసులు, సిందూర లు ఆరోగ్య సురక్ష చేపట్టారు. ఇందుకు సుమారు 402 మంది రోగులు హాజరు కాగా వారికీ వైద్య పరీక్షలు చేశారు. ఆయా వ్యాధులును పట్టీ మందులను అందజేశారు. ఆందోళనకర రోగులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు వైద్యులు మీడియాలో పేర్కొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

**భద్రత పరంగా గట్టి చర్యలు చేపట్టాలి**
**పోలీసుల సమీక్షలో డిఐజి, ఎస్‌పి**

**ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్**

రానున్న ఎన్నికలను పోలీసు సిబ్బంది టీం వర్క్ తో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా విధులు నిర్వర్తించాలని కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్. విజయ రావు, జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిసికెమెరాల కంట్రోల్ రూమ్‌ను, జిల్లా పోలీసు పరేడ్ మైదానాన్ని వారు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ముందుగా పోలీసు గార్డు సిబ్బంది డిఐజికి గౌరవ వందనం చేశారు. తనిఖీ లలో భాగంగా డిపిఒలోని అన్ని విభాగాల పనితీరు గురించి డిఐజి సమీక్షించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని సబ్ డివిజన్ డిఎస్‌పిలు, సిఐలతో కర్నూలు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్‌పి సమీక్షించి డిఐజి మాట్లాడారు. అందరూ టీమ్ వర్క్ గా పని చేసి ఎన్నికలను ప్రశాంతంగా, శాంతియుత వాతవరణంలో జరిగే విధంగా చూడాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్పందించాలని, ఎక్కడ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, డబ్బు, బార్డర్ చెక్ పోస్టుల వద్ద అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాల రికవరీ , రోడ్డు ప్రమాదాలు, రాత్రి గస్తీ, సెక్టార్ మొబైల్స్, నాన్ బెయిలబుల్ వారెంట్స్, మర్డర్ కేసుల ముద్దాయిల అరెస్టు పెండింగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయుధాల లైసెన్సుల డిపాజిట్లు, రౌడీ షీటర్స్ , ట్రబుల్ మాంగర్స్ , సమస్యాత్మక గ్రామాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున జిల్లాలోని పోలింగ్ లోకేషన్స్, సిసి కెమెరాలు, ఫ్యాక్షన్ గ్రామాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలలో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ మాట్లాడుతూ... నేరాలను, రోడ్డు ప్రమాదాలను బాగా తగ్గించామన్నారు. . కర్నూలు రేంజ్ డిఐజి ఆదేశాల తో ఎన్నికలను ప్రశాంత వాతవరణంలో జరిగే విధంగా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఏ చిన్న పాటి సంఘటన చోటు చేసుకున్నా వెంటనే టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ నాగరాజు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి నాగబాబు, డిఎస్‌పిలు విజయ శేఖర్, శివనారాయణ స్వామి, సీత రామయ్య, ట్రైనీ డిఎస్‌పి భావన, సిఐలు పాల్గొన్నారు.

# కరువు సహాయక చర్యలు చేపట్టాలి

**ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ప్రభుత్వం మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. కర్నూలు మండలం పడిదంపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యత్వం చేర్పింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా నిత్యం కరువుకు గురవుతున్నదన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ దెబ్బతిని రైతాంగం విలువలను అడుగుతున్నారని, కరువు మండలాలుగా ప్రకటించారు తప్ప ఇప్పటివరకు కరువు సాయక చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. వెంటనే కరువు సాయక చర్యలు చేపట్టి ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం రైతుల ఖాతాలో జమచేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలను తీసుకుని ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఉన్నదన్నారు. అటువంటి సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, రైతులందరూ సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రైతులందరికీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చి పోరాడుతున్న ఏకైక సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘమని ఆయన తెలిపారు. జిల్లాలో కరువు

కాటకాలకు గురైన రైతులకు అండగా నిలవడం నకిలీ విత్తనాల బారిన పడిన రైతాంగం కోసం పోరాటం భూములు కోల్పోయిన రైతుల పక్షాన పోరాడే న్యాయమైన నష్టపరిహారం ఇప్పించిన చరిత్ర ఆంధ్రప్రదేశ్ రైతు సంఘానిదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు నాయకులు శ్రీనివాసులు ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఈనాడు కార్యాలయం పై దాడికి టిడిపి ఖండన

**టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బి టి నాయుడు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకష్ణపై వైసీపీ మూకల దాడిని మరకముందే కర్నూలు నగరంలోని ఈనాడు కార్యాలయం పై వైసిపి కార్యకర్తలు దాడి చేయడాన్ని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, యం.యల్.సి బి.టి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు రాం పుల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి హిందూపురం నియోజకవర్గం పరిశీలకులు నరసింహులు యాదవ్ వేరువేరు ప్రకటనలలో తీవ్రంగా ఖండించారు.వైసిపి పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్ని నిర్వీర్యం చేసి పత్రికా స్వేచ్ఛను హరించారన్నారు. వైసిపినేతల అవినీతి అక్రమాలను పత్రికలు బయట ఎండగడుతున్నందున తన చేతకాని తనాన్ని కప్పి పుచ్చుకునేందుకు జగన్ మోహన్ రెడ్డి పత్రికా స్వేచ్ఛ హరించే విధంగా వారి అనున్యాయులతో, వైయస్సార్ పార్టీ గూండాలతో డాడులకు పూనుకోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు కేంద్ర ప్రభుత్వానికి సూచన చేయాలని విఘ్నప్తి చేస్తూ రాష్ట్రంలో వైఎస్.జగన్ ప్రభుత్వం కొనసాగిస్తున్న అరాచకాలను అరికటించాలంటే వెంటనే రాష్ట్రపతి పాలన విధించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## దాడి చేయడం సరికాదు

**ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్.**

రాప్తాడు జగన్ సభలో ఆంధ్రజ్యోతి విలేకరిపై, కర్నూలు ఈనాడు దినపత్రిక కార్యాలయం పై వైసిపి దాడులు చేయడాన్ని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు దౌర్జన్యాలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఏదైనా తప్పుడు వార్తలు అవాస్తవాలు రాస్తే చట్టం ప్రకారం వారి పైన చర్యలు తీసుకోవాలి కానీ ఇలా రౌడీయిజం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మీడియాకు స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని తెలిపారు. ఇలాంటి దాడులను దౌర్జన్యాలను అధికార పార్టీ దగ్గరుండి ప్రోత్సహించడం బాధాకరమన్నారు. తక్షణమే పోలీస్ యంత్రాంగం దాడులకు దౌర్జన్యాలకు పాల్పడిన వారి పైన ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు.

## వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి : శ్రీదేవి

**ప్రజాశక్తి మద్దికేర**

ఎమ్మెల్యే శ్రీదేవికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్ర అభివద్ధి సాధ్యమని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. మంగళ వారం మద్దికేరలో హెల్త్ క్లినిక్ ను తారురోడ్డును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడంలో వైసిపి ప్రభుత్వం ముందుంటుందన్నారు. మద్దికేర మండలంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి చైతన్యం చేయాలన్నారు.

డ్వాక్రా గ్రూపులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్

**- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక**

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన మాట మేరకు డ్వాక్రా రుణమాఫీని నాలుగు విడతల్లో పూర్తిగా చెల్లించి మాట నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. మంగళవారం గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో ఆసరా నాలుగో విడత నగదు పంపిణీ సంబరాలు వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరై మండలంలోని 565 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు చెందిన 5,222 మంది సభ్యులకు రూ.3,49,48,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలను పేదరికం నుంచి దూరం చేసి ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడా మహిళలు, ప్రజలందరూ సహకరించి వైసిపిని గెలిపించి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. బుట్టా రేణుక మాట్లాడుతూ... ఎమ్మెల్యే సీటును ముఖ్యమంత్రి బీసీలకు కేటాయించడంతో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజలకు ముందుకు వస్తున్నానని, రానున్న ఎన్నికల్లో ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బుట్టా నీలకంఠ, ఎంపిపి నసురుద్దీన్, సింగిల్‌విండో తిరుమలరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, వైసిపి యూత్ అధ్యక్షులు బండే నవాజ్, మండల కన్వీనర్ దౌలబాబు నాయుడు, గంజిహళ్లి మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏడ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు

**- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి**

**ప్రజాశక్తి - ఆదోని**

ఏడ్చి కన్నీరు కార్చిన టిడిపి అధినేత చంద్రబాబును, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వారికి ఈ ఎన్నికలే చివరివని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ మైదానంలో వార్డు వెల్ఫేర్ వేణుగోపాల్ అధ్యక్షతన 'వాలంటీర్లకు వందనం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో చేసిన అవినీతిని బయటపెట్టినందుకే చంద్రబాబు కన్నీరు కార్చారని, తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఎన్నికల్లో గెలిచే ప్రసక్తే లేదని తెలిపారు. టికెట్ రాదని తెలిసి ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. స్వలాభ్యం కోసం ఏడ్చినా ప్రజలు నమ్మరని, ఈ వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా 640 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏమాత్రం అమలు చేశారో ప్రజలకు వివరించాలని నిలదీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. కుటుంబానికి మంచి చేసి ఉంటేనే ఓటు వేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పడం ఆయన ధైర్యానికి నిదర్శనమని తెలిపారు. మోసాలు, దగాలు చేయడం చంద్రబాబు నైజమన్నారు. కరోనా సమయంలో వాలంటీర్ల సేవలు అమోఘమని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ శాంత, మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, వైస్ చైర్మన్లు గౌస్, నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, సందీప్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, బాలాజీ, యాసిన్, సురేష్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జీ మేనేజర్ అస్లాం బాష, నాయకులు చంద్రకాంత్ రెడ్డి, కిషోర్, నాగరాజ్, మమ్మద్ స్వామి, నారాయణ ఉన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

## వాలంటీర్ల సేవలు ప్రశంసనీయం

**- ఎంపిపి భర్త లుముంబా**

**ప్రజాశక్తి - దేవనకొండ**

ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు మధ్య వారధులుగా ఉంటూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జెఎసి మండల కోఆర్డినేటర్ రాజారెడ్డి, ఎంపిటిసి సభ్యులు తపాల శ్రీనివాసులు నాయుడు కొనియాడారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ ఇద్రూస్ బాష అధ్యక్షతన అన్ని సచివాలయాల పరిధిలోని వాలంటీర్లకు వందనం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో కుంకనూరు, పల్లెదొడ్డి, తెర్నేకల్, పి.కోటకొండ, అలారుదిన్నెకు చెందిన ఐదుగురు వాలంటీర్లకు సేవా రత్న, మిగిలిన 294 మంది వాలంటీర్లకు సేవ మిత్ర అవార్డులు దక్కాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే వాలంటీర్ల వ్యవస్థ అలాగే కొనసాగుతుందని, ప్రతి వాలంటీర్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. వైసిపి నాయకులు వెలమకూరు రామచంద్ర, పల్లెదొడ్డి చంద్రన్న, పాలకుర్తి ప్రతాప్, ఉదుకుండు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

## ఒపిఎస్ అమలుకు
## మేనిఫెస్టోలో పొందుపరచండి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు మేనిఫెస్టోలో పొందు పరచాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. రాష్ట్ర పభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు బీఎస్పీ మేనిఫెస్టోలో పొందుపరిచి అధికారంలోకి రాగానే కచ్చితంగా అమలు చేయాలని కోరారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జ్ ఎర్రన్న, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర వాల్మీకి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బంగారప్ప, మహిళా విభాగం అధ్యక్షులు పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నాగమణి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎ.భాస్కర్, ఎమ్మిగనూరు రూరల్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఎం.రాజు, సహాధ్యక్షులు ఎస్.సుధాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రస్తుతం అమలులో ఉన్న సిపిఎస్ వల్ల విశ్రాంత ఉద్యోగులకు జీవిత భద్రత ఉండదని తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధినాయకత్వం 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని అమలుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు స్పందించిన బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, రాఘవేంద్ర, బంగారప్ప, పద్మావతి మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు విరమణ పొందిన తర్వాత వారి జీవితానికి భద్రత ఉండాలంటే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. రాష్ట్ర పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి ఒపిఎస్‌ను అమలుపరిచే విధంగా మేనిఫెస్టోలో పొందుపరిచే విధంగా కోరుతామని చెప్పారు.

బీఎస్పీ నాయకునికి వినతి అందిస్తున్న నాయకులు

## 23న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

**ప్రజాశక్తి - దేవనకొండ**

మండలంలోని గుండ్లకొండ గ్రామంలో శ్రీసీతారాములు, ఆంజనేయ, వీరభద్ర స్వామి, శివాలయం, సుంకులా పరమేశ్వరి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన సందర్భంగా ఈనెల 23న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ రామదాసు గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే వృషభాల యజమానులు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు (నీలకంఠం గౌడ్), రెండో బహుమతి రూ.40 వేలు (రాజేష్), మూడో బహుమతి రూ.30 వేలు (నరసయ్య గౌడ్), నాలుగో బహుమతి రూ.20 వేలు (కొట్టాల ఎంపిటిసి సుల్తాన్), ఐదో బహుమతి రూ.10 వేలు (రంగముని) అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇతర వివరాలకు 7658935383, 9177593295 సెల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

**- యుటిఎఫ్ నాయకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని యుటిఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు సునీల్ రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యా శాఖలో విలీనం చేసినా ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించకుండా మున్సిపల్ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ ఉపాధ్యాయులు వివక్షకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా అడుగుతున్నా ఇప్పటికీ జిపిఎఫ్ సౌకర్యం కల్పించకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యా శాఖ మున్సిపల్ శాఖ మంత్రులు స్పందించి జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మల్లికార్జున జగన్మోహన్, రుషికేశవ్, చక్రపాణి, నాగేష్, విష్ణువర్ధన్ రెడ్డి, ఇమ్రాన్, సాధిక్ హుస్సేన్, సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

# ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లకు వందనం

**- వైసిపి ఇన్‌ఛార్జీ విరుపాక్షి, మండల కన్వీనర్ మారయ్య**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ఎక్కడా అవినీతి లేకుండా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందిస్తున్న వాలంటీర్లకు వందనమని వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ బి.విరుపాక్షి, వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. మంగళవారం చిప్పగిరి వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ నరేన్ సాహెబ్ అధ్యక్షతన వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వారు ముఖ్య అతిథులుగా హాజరయి మాట్లాడారు. తమ కుటుంబ సభ్యులైన వాలంటీర్లందరూ అవినీతి లేకుండా ప్రజల ముంగిటికీ సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పథకాన్నీ ప్రజల ముంగిటికీ చేర్చి వారి మన్ననలు పొందుతున్న తమ సారథులు వాలంటీర్లని చెప్పారు. నేడు ప్రతిపక్షాలు వాలంటీర్ల మీద అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వారందరికీ వాలంటీర్లు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని తెలిపారు. ప్రతి వాలంటీరూ రోజూ ఒక సమయం కేటాయించుకొని కేటాయించిన ఇళ్లలో సంక్షేమ పథకాలపై.. వారి పొందుతున్న ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని వాలంటీర్లకు సూచించారు. ఈ రెండు నెలల కాలం ఒక పరీక్షలాగా భావించి మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అహర్నిశలు కష్టపడాలని కోరారు. అనంతరం విరుపాక్షి, మారయ్య చేతుల మీదుగా సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వాలంటీర్లకు సన్మానించి, ప్రశంసాపత్రాలను అందించారు. ఇఒఆర్‌డి బాలన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంపిటిసి సుంకన్న, వైసిపి నాయకులు జూటూరు లింగన్న, వెంకటేశులు, ఓలయ్య, పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, జయరామ్ నాయక్, సిసింద్రీ, నరసింహులు, రామాంజనేయులు, ప్రమీల పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న వాలంటీర్లతో విరుపాక్షి, మారయ్య

# ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు

**- పిహెచ్‌సి డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా గ్రామాలకు వెళ్లి ప్రజల చెంతకే మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నామని చిప్పగిరి పిహెచ్‌సి డాక్టర్ పార్వతమ్మ, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నేమకల్లు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష-2' ద్వారా గ్రామంలోని ప్రజలు, మహిళలు కర్నూలు నుంచి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్లు జయలక్ష్మి, సాయి కిరణ్‌తో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గర్భిణులు, బాలింతలు కూడా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ మంజుల 24 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా నిరుపేదలందరూ వైద్య పరీక్షలు చేసుకుంటున్నందుకు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని డాక్టర్లు తెలిపారు. సూపర్‌వైజర్లు విమలాదేవి, పద్మావతి, ఎఎన్ఎం సువర్ణ, ఎంఎల్‌హెచ్‌పి రెడ్డి శేఖర్, నాయక్, డిజిటల్ అసిస్టెంట్ దినేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి, మహిళా సంరక్షకులు పావని, ఆశా కార్యకర్తలు రాధమ్మ, కవిత, వీరమ్మ, జములమ్మ, మస్తానమ్మ, అనంతలక్ష్మి పాల్గొన్నారు. **నందవరం** మండలం పెద్దకొత్తిలి గ్రామంలోని గ్రామ సచివాలయంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష డాక్టర్ విజయ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచి శివన్న, ఎంపిటిసి సభ్యులు విజయ మోహన్ రెడ్డి మాట్లాడారు. 17 రకాల పరీక్షలు, 77 రకాల మందులు రోగులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రవల్లిక, అరవింద్, వైసిపి గ్రామ నాయకులు, మాజీ సర్పంచి సోమన్న, రఘునాథ్, జయరామి రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు నరసింహులు, థామస్ పాల్గొన్నారు.

నేమకల్లులో పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

నందవరంలో మెడికల్ కిట్లను చూపిస్తున్న నాయకులు

# ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం

**- మాజీ ఎమ్మెల్యే బీవీ**

**ప్రజాశక్తి - నందవరం**

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి విమర్శించారు. మంగళవారం నందవరం ఎస్సీ కాలనీలో టిడిపి యువ నాయకులు గురు రాజ్ దేశాయి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. పల్లె నిద్ర కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ కాలనీలో తాగునీరు, డ్రెయినేజీ, సిసి రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, పొలాలకు వెళ్లే రహదారులు సరిగ్గా లేవని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, టిడిపి అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు తీరుతాయని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో టిడిపి అధికారంలోకి వస్తుందని, ప్రజల సమస్యలను పరిష్కరించే ఏకైక పార్టీ టిడిపి అని చెప్పారు. ప్రజలు వైసిపి ప్రభుత్వ పాలనలో విసిగిపోయారని, అభివృద్ధి కోసం టిడిపి వైపు చూస్తున్నారని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్, నాగరాజు గౌడ్, మాధవరావు దేశాయి, ఖాసీం వలి, గోపాల్, గజేంద్ర రెడ్డి, వీరారెడ్డి, బాలరాజు, వీరేష్, దావీదు, ఆదిశేషు పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీవీ

మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు హుస్సేన్ సాబ్

## టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి

**- టిడిపి మైనార్టీ నాయకులు హుస్సేన్ సాబ్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మైనార్టీల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని టిడిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు హుస్సేన్ సాబ్, ప్రధాన కార్యదర్శి తురేగల్ నజీర్ తెలిపారు. మంగళవారం వారు టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి టిడిపి అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. టిడిపి గెలుపునకు మైనార్టీలు కట్టుబడి ఉన్నారని తెలిపారు. మైనార్టీ నాయకులు శాబీర్, సలాం, కలీముల్లా, దాదా, సలీం, గౌస్, ఫరీద్, మున్నా, దౌలత్, గుడుసాబ్, నాగుర్ బాషా, అబ్దుల్లా, హనీఫ్ బేగ్, ఇబ్రహీం, ముస్తాక్, నజీర్, హుసేన్స్, సమీవుల్లా, రంజాన్ పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమానికి కృషి

**- ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్**

**ప్రజాశక్తి - ఆదోని**

వికలాంగుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త, విట్టా గ్రూప్స్ అధినేత, భీమాస్ లాడ్జి యజమాని విట్టా రమేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆయన ఛాంబర్‌లో జిల్లా వికలాంగుల జెఎసి అధ్యక్షులు బీసీ.నాగరాజు, కోశాధికారి కె.ఈరన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి కమతం వెంకటేష్, కార్యవర్గ సభ్యులతో కలిసి 29న కర్నూలు నగరంలో నిర్వహించే వికలాంగుల సింహ గర్జన మహాసభకు విశిష్ట అతిథిగా రావాలని ఆహ్వానించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా కరపత్రాలు, గోడపత్రికలను విడుదల చేశారు. విట్టా రమేష్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. జెఎసి జిల్లా నాయకులు బి.రామదాస్, వి.కాంతరాజు, జి.రాజు, సి.మల్లికార్జున, సర్వభూషణం, కత్తి రామాంజనేయులు, సాబీర్ పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న విట్టా రమేష్

# 29న ముస్లిం, మైనార్టీల మహా గర్జన

**- ఎంఆర్‌పిఎఫ్ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా**

**ప్రజాశక్తి - ఆదోని**

ముస్లిం, మైనారిటీల హక్కుల సాధన, వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడడం కోసం ఈనెల 29న పట్టణంలోని మసూదియా ఉర్దూ పాఠశాల ఆవరణంలో మహా గర్జనను నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం మసూదియా పాఠశాల ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా ముస్లిం, మైనార్టీల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్య పరంగా ముస్లింలు అట్టడుగులో ఉన్నారని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు రాష్ట్రంలో 70 వేల ఎకరాలు, జిల్లాలో 30 వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. భూ ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో ఆస్తులు ఉన్నాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేటికీ రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటున్నాయని విమర్శించారు. తమను ఆర్థికంగా, రాజకీయంగా ప్రోత్సహించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని, విద్య, వైద్య రంగాల్లో ప్రాధాన్యత ఇస్తామని మేనిఫెస్టోలో చేర్చిన వారికే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఆదోని డివిజన్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని కాపాడమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ పోరాటం కేవలం ఒక్కరోజుతో ఆగిపోదని, కర్నూలు నుంచి ఢిల్లీ దాకా పోరాడతామని తెలిపారు. ఈ మహా గర్జనకు జిల్లా నలుమూలల నుంచి ముస్లింలంతా భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సంస్థ ప్రభుత్వానికి, ముస్లింలకు వారధిగా పనిచేస్తుందని, ముస్లింల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎంఆర్‌పిఎఫ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ రోషన్, వ్యాపారవేత్త ఉమ్మి సలీం ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

# విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం

**- తీవ్రంగా గాయడిన కాంట్రాక్టు కార్మికునికి అందని మెరుగైన వైద్యం**

**- ఎఇకి మెమోతో సరిపెట్టిన ఉన్నతాధికారులు**

**ప్రజాశక్తి-ఆలూరు**

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల హత్తిబెళగల్ గ్రామానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు దివాకర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యమందక అవస్థలు పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై విచారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు ప్రమాదానికి లైన్‌మేన్ చంద్రశేఖర్‌ను బాధ్యుని చేసి సస్పెండ్ చేశారు. ఎఇకి మెమోతో సరిపెట్టడంపై ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 13న ఆలూరు మండలం కరిడిగుడం గ్రామ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్ లైన్‌లో పనులు జరిగిన సమయంలో ఎల్‌సి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రమాదం చోటుచేసుకుని దివాకర్ తీవ్రంగా గాయపడ్డారు.

**బాధితునికి అందని మెరుగైన వైద్యం**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దివాకర్‌కు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాల్సిన విద్యుత్ శాఖ అధికారులు, గుత్తేదారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బళ్లారిలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. విద్యుత్ శాఖాధికారులు, గుత్తేదారు బాధితునికి అండగా నిలవాలని ఉంటే కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఈ ప్రమాదానికి కేవలం లైన్‌మేన్ కాకుండా సంబంధిత అధికారులను, గుత్తేదారును కూడా బాధ్యులను చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తీవ్రంగా గాయపడిన కార్మికుడు

### బాధితుని ఆదుకోవాలి

**-కెపి.నారాయణస్వామి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి**

విద్యుత్ ప్రమాదంలో గాయపడిన దివాకర్‌కు ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన సేవలు అందించాలి. ప్రభుత్వ ఉద్యోగం కల్పించి బాధితుని, కుంటుంబాని ఆదుకోవాలి. విద్యుత్ శాఖ, గుత్తేదారు కలిసి బాధితునికి రూ.10 లక్షలు ఇవ్వాలి. బాధ్యులైన గుత్తేదారు కొండయ్య స్వామిపై, ఎఇ లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి. లేకపోతే సిఐటియు ఆధ్వర్యంలో బాధితునితో కలిసి ఆందోళనలు చేపడతాం.

### కుటుంబ సాధికార సభ్యులు
## సైనికుల్లా పనిచేయాలి

**- బీవీ గెలుపే లక్ష్యం - టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

కుటుంబ సాధికార సభ్యులు సైనికుల్లా పని చేయాలని టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్, 23వ వార్డు ఇన్‌ఛార్జీ మహబూబ్ బాషా కోరారు. మంగళవారం పట్టణంలోని బుడగ జంగాల కాలనీలోని బి.సురేంద్ర ఇంట్లో టిడిపి కుటుంబ సాధికార సభ్యుల సమావేశం నిర్వహించారు. 23వ వార్డు ఇన్‌ఛార్జీ మహబూబ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 60 ఓటర్లకు ఒక పురుషుడిని, 60 ఓటర్లకు ఒక స్త్రీని, గృహ సారథులుగా, సాధికార సభ్యులుగా టిడిపి కార్యకర్తలు ఉంటారని తెలిపారు. టిడిపి మేనిఫెస్టోను, 120 మంది ఓటర్లకు సేవలు అందించాల్సిన బాధ్యత, టిడిపి పథకాలను చేర్చాలని కోరారు. 120 కుటుంబాల సమస్యలను సాధికార సభ్యులు, గృహ సారథులు పరిష్కరించలేకపోతే వార్డు ఇన్‌ఛార్జీ, యూనిట్ ఇన్‌ఛార్జీ, క్లస్టర్ ఇన్‌ఛార్జీలకు తెలియజేస్తే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.నాగేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. 50 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయని, ప్రతి కార్యకర్త టిడిపి సైనికుల్లా ముందుకు దూసుకెళ్లాలని కోరారు. బీవీ.జయ నాగేశ్వర్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని తెలిపారు. 96వ బూత్ కుటుంబ సాధికార సభ్యులు రుద్రాక్షల పెద్దయ్య, ఎస్.మారెప్ప, సి.ఉదయ్, హనుమాపురం శీను గౌడ్, సి.మధు, బి.రవి కుమార్, సి.కన్నయ్య, బి.వెంకటేష్, కె.శివ, పి.ప్రసాద్, సూరి నాయుడు (దొరస్వామి) పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దయాసాగర్

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**ప్రజాశక్తి - కౌతాళం**

జిల్లాలోని మారు మూల గ్రామంలో ఓ కుటుంబంలో ఇద్దరు వికలాంగులు ఉన్నారు. ఆ ఇద్దరు అన్నదమ్ములూ బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో ఉండాలని తల్లిదండ్రులు కలలు కన్నారు. పక్షవాతంతో ఇద్దరి కాళ్లు, చేతులు సచ్చు బడిపోయి నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వారి పోషణ భారమంతా తల్లితండ్రులపై పడింది. మండలంలోని కామవరం గ్రామంలో గాజుల దస్తగిరి సాబ్, శేఖర్ బీ దంపతుల కుమారులు ఇర్ఫాన్ అలీ, ఇమ్రాన్ అలీల పరిస్థితి ఇది. ఈ కుటుంబ పరిస్థితిని స్థానికుల ద్వారా తెలుసుకున్న గ్రామ నాయకుడు మహేందర్ రెడ్డి కొన్ని నెలల క్రితం ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికప్పుడే ఆ పిల్లలను చూసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష చొప్పున మంజూరు చేయాలని కలెక్టర్ సృజనను ఆదేశించారు. ఆ కుటుంబానికి కొండంత అండ లభించింది.

చెక్కును అందజేస్తున్న నాయకులు

**సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ**

ఈ కుటుంబానికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ.2 లక్షల చెక్కును వైసిపి మండల నాయకులు వీరసేనారెడ్డి మంగళవారం కామవరం గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, మహేందర్ రెడ్డి సహకారంతో ఈ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని కుటుంబం తెలిపారు.

## ఉజ్వల్ పథకం డొల్ల : కాంగ్రెస్

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

నిరుపేదలకు గ్యాస్ సిలిండర్, స్టౌవ్ ఉచితంగా అందజేసేందుకు తెచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం ఆచరణలో ఒక డొల్ల పథకంగా కనిపిస్తోందని కాంగ్రెస్ ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప విమర్శించారు. దేశంలోని నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్, స్టౌవ్, రెగ్యులేటర్ అందజేసేలా పథకం రూపొందించారని, గ్యాస్ ఏజెన్సీలు మాత్రం ఒక్కో కనెక్షన్‌కు అప్లికేషన్ రూపంలో రూ.400 నుంచి 600, 700 వసూలు చేస్తూ పథకానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. నాసిరకమైన స్టౌవ్ ఇవ్వడంతో వినియోగదారులు పక్కన పడేసే పరిస్థితి ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు, కలెక్టర్ స్పందించి ఈ పథకంలో అవినీతికి పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు చేపట్టే విధంగా చూడాలని కోరారు. ఉచితంగా ఇవ్వాల్సిన పథకానికి డబ్బులు వసూలు చేస్తున్న ఏజెన్సీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, సాయినాథ్, సుంకన్న, రామన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌యూ విసి

# కనీస వేతన జిఒను అమలు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం
- పాణ్యం సచివాలయం వద్ద పంచాయతీ కార్మికులు ధర్నా

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం

**ప్రజాశక్తి - పాణ్యం**

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతన జీవోను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, కనీస వేతనం జిఒను అమలు చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం పాణ్యం సచివాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం మాట్లాడుతూ తరతరాలుగా గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలను శుభ్రం చేస్తూ, పర్యావరణాన్ని కాపాడుతూ, ప్రజలు అంటురోగాల బారిన పడకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప పంచాయతీ కార్మికుల జీవితాల్లో మాత్రం ఏ మార్పు లేదన్నారు. ఏ ప్రభుత్వమైనా తమ జీవితాలు మారుస్తుందని ఆశతో ఎదురు చూస్తున్న పంచాయతీ కార్మికులకు నిరాశే ఎదురవుతుందని చెప్పారు. సంవత్సరాలు గడుస్తున్నా వేతనాలు పెంచడం లేదని తెలిపారు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వస్తే తమ జీవితాలు మారుతాయని ఆశతో ఎదురు చూసిన కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారే తప్ప కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, గుర్తింపు కార్డులు తదితర వాటిని అమలు చేయలేదన్నారు. టెండర్ విధానం రద్దు చేసి 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని సంవత్సరాల తరబడి పోరాటాలు చేస్తున్నా చూస్తాం చేస్తామంటూ ఆశ చూపుతున్నారే తప్ప ఏ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించడం లేదని చెప్పారు. 30 నుండి 40 సంవత్సరాలుగా పనులు చేస్తున్న కార్మికులకు తగిన గుర్తింపు లేదన్నారు. ఏడాదిలో అనేకమార్లు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగినా పంచాయతీ కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసినా గుర్తింపు లేదని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాల జీవో అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్, పాణ్యం గ్రామ పంచాయతీ కార్మికులు శ్రీరాములు, దినేష్, ప్రవీణ్, లక్ష్మీదేవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్‌లో సమస్త సమాచారం

- విద్యాభివృద్ధిలో అనుభవం ఉండాలి
- రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీకర్ ప్రేమ్ కుమార్

**ప్రజాశక్తి - నంద్యాల**

కంప్యూటర్ విద్య అనేది ఈ రోజుల్లో చాలా ఇంట్రెస్టింగ్ నాలెడ్జ్ అని, ఏ సమాచారం కావాలన్నా కంప్యూటర్‌లో దొరుకుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాలలోనిశ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ఇన్నోవేషన్‌లో భాగంగా అదనపు కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ ఉపకులపతి ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ హాజరై ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యాభివృద్ధిలో చాలా ఎక్స్పరిమెంట్, అనుభవం ఉండాలన్నారు. తనకు 40 సంవత్సరాల అనుభవం ఉందని తెలిపారు. డెవలప్ ది ఇన్స్టిట్యూషన్స్‌లో అనుభవం ఉందని తెలిపారు. తన కెరీర్‌లో ఒక విద్యార్థి బాగా చదువుకొని మెకానికల్ ఇంజనీర్‌గా వర్క్ చేస్తున్నారని, స్టూడెంట్ చాలా మంచి పొజిషన్లోలో వుండడం గర్వంగా ఉందన్నారు. శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల విద్యార్థులు కూడా అత్యున్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చాలా వరకు విద్యార్థులందరికీ 700 కంప్యూటర్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. విద్యార్థులు మంచి అవగాహనతో స్ఫూర్తితో ముందుకొచ్చి, సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కళాశాల అసిస్టెంట్ మేనేజర్ జి.ప్రగతి రెడ్డి మాట్లాడుతూ కాలేజీలో అదనపు ల్యాబ్ ప్రారంభమవడమనేది విద్యార్థులకు చాలా మంచి విషయమన్నారు. కంప్యూటర్స్ విభాగ సమన్వయకర్త డాక్టర్ యువిఎస్.కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ముందుగా నాలెడ్జ్ అనేది చాలా ముఖ్యమన్నారు. అనంతరం ఆర్‌యు విసి బి.సుధీర్ ప్రేమ్ కుమార్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. చివరిగా సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వి.విజయ కుమారి, డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు వెంకట్రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

- టిడిపి, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో రాస్తారోకో

**ప్రజాశక్తి - మహానంది**

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టిడిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఫొటో గ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం మహానందిలోని టోల్గేట్ వద్ద టిడిపి మండల నాయకులతో కలిసి ఆయన రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించడం హేయమైన చర్య అన్నారు. సమాజంలో పత్రిక రంగాన్ని గౌరవించాలని తెలిపారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కో కన్వీనర్ కాకర్ల శివ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పాత్రికేయులకు రక్షణ కరువైందని అన్నారు. అనంతరం తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి అస్లాం బాషా, టిడిపి నాయకులు నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, విలేకరులు రామకృష్ణుడు, బాలకృష్ణ, వెంకట శివయ్య, నరసింహ, మహేష్, వలి, రఫీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుష మని సిపిఐ ఆళ్లగడ్డ తాలూకా కార్యదర్శి కొమ్ము భాస్కర్, మాల మహాసేన మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. దాడిని నిరసిస్తూ రుద్రవరం తహశీల్దార్ మురళీమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. విలేకరులు కట్టుబడి భాష, జిసి నాగయ్య, శంకర్, జాన్, మోహన్, ఇమామ్ హుస్సేన్, బాల మద్దిలేటి, నరసింహ, ఆంజనేయులు, షేక్షావలి, రామచంద్రారెడ్డి, ఇమ్మానుయేల్, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలోని టోల్‌గేట్ వద్ద రహదారిపై రాస్తారోకో చేపడుతున్న టిడిపి, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

# పేద జంటల కుటుంబాల్లో వెలుగులు

- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ఆర్థికసాయం జమ
- 479 మంది జంటలకు 4.06 కోట్లు మంజూరు
- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు



మెగా చెక్ పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ తదితరులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నూతనంగా వివాహం చేసుకున్న పేద జంటల కుటుంబాల్లో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సిఎం క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా అక్టోబర్ నుండి డిసెంబర్-2023 త్రైమాసికంలో నూతనంగా వివాహం చేసుకున్న అర్హులైన 10,132 జంటలకు రూ.78.53 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, బెస్త సంక్షేమ అభివృద్ధి సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, సోషల్ వెల్ఫేర్ డిడి చింతామణి, బీసీ కార్పొరేషన్ అధికారి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదవ విడతలో అర్హులైన 479 మంది జంటలకు రూ. 4 కోట్ల 6 లక్షల 35 వేలు జమ చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 2669 మంది లబ్ధిదారులకు రూ. 22 కోట్ల 31 లక్షల 70 వేలు జమ చేసినట్లు చెప్పారు. అక్టోబర్ నుండి డిసెంబర్-2023 త్రైమాసికంలో నూతనంగా పెళ్లి చేసుకున్న ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 71 జంటలకు, బనగాన పల్లిలో 92, నందికొట్కూర్ 80, డోన్ 81, నంద్యాల 11, పాణ్యం 25, శ్రీశైలంలో 59 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ఆర్థికసాయం వధువు తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు హబీబుల్లా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు వైఎస్ఆర్ కల్యాణమస్తు ద్వారా, మైనారిటీ వర్గాల ఆడ పిల్లలకు వైఎస్ఆర్ షాదీ తోఫా అండగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ముఖ్య అతిథులు మెగా చెక్కును అందజేశారు.

## రైతులకు సంక్షేమ పథకాలన్నీ అందించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు

**ప్రజాశక్తి - పాణ్యం**

అన్నదాతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు అందేలా చూసే బాధ్యత రైతు భరోసా కేంద్రాలదేనని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు తెలిపారు. పిఎం కిసాన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాణ్యం మండల వ్యవసాయ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ క్రాప్, రబీ పంటలు, రైతు భరోసా తదితర అంశాలపై ఆరా తీశారు. ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి జయ ప్రకాష్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారికి వినికిడి యంత్రం ఎమ్మెల్యే అందజేత

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల పట్టణం 33వ వార్డుకు చెందిన మూగ చెవిటితో బాధపడుతున్న చిన్నారికి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరయిన రూ. 4 లక్షల 50 వేల విలువ గల వినికిడి యంత్రాన్ని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టు మూగ చెవిటితో బాధపడుతున్న చిన్నారికి ఆరోగ్యశ్రీ ద్వారా కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ నిర్వహించి వినికిడి యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొన్ని కారణాల వల్ల వినికిడి యంత్రం పని చేయకపోవడంతో చిన్నారి తల్లి స్థానిక కౌన్సిలర్ ఎద్దు మనోరంజని దృష్టికి తీసుకురాగా వెంటనే సిఎంఆర్‌ఎఫ్ ద్వారా వినికిడి యంత్రాన్ని తెప్పించి అందజేసినట్లు తెలిపారు. బాధిత చిన్నారి తల్లి సిఎం జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యేకు, కౌన్సిలర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### డిఎంహెచ్ఒ కార్యాలయం ఎఒ మృతి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఏవో డాక్టర్ చంద్రశేఖర్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఆయన మృతి వైద్య రంగానికి తీరని లోటని పలువురు ప్రముఖ వైద్యులు సంతాపం తెలిపారు. ఆయన మృతి పట్ల డిఎంహెచ్ఒ వెంకట నారాయణ ద్రిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. ఆయన మతికి సంతాపం ప్రకటిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఎపిఎన్‌జిఒ నాయకులు సంతాపం :** చంద్రశేఖర్ మృతి తీరని లోటని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు టి.మణి శేఖర్ రెడ్డి, కార్యదర్శి హుస్సేన్ రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్ర శేఖర్ మృతికి సంతాపం ప్రకటిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

### వాలంటీర్ల సేవలు ప్రశంసనీయం : ఎంపిడిఒ

**ప్రజాశక్తి - అవుకు :** వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని అవుకు ఎంపిడిఒ మల్రెడ్డి అన్నారు. మంగళవారం అవుకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం వాలంటీర్లకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నందుకు వాలంటీర్లకు పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, వాలంటీర్లు, మహిళా వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### లైన్‌మెన్‌లపై ఎఇ కక్షసాధింపు ఆపాలి

**ప్రజాశక్తి - పాణ్యం :** పాణ్యం మండల విద్యుత్ కేంద్రంలో పని చేస్తున్న లైన్‌మెన్‌లపై ఎఇ కక్షసాధింపు చర్యలను వెంటనే ఆపాలని 1104 విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు మహేశ్వర రెడ్డి, మల్లికార్జున రావు, కృపవరం, లైన్‌మెన్‌లు విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైన్‌మెన్‌లకు ఎఇ టిఏలు ఇవ్వకుండా వేదిస్తున్నారని, ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు వున్నాయని, పై అధికారులకు సమాచారం అందించిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఆయన మీద వేసిన విచారణ కమిటీ తాత్సారం చేయకుండా నివేదికఇచ్చి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎమ్మెల్యే

ట్రాఫిక్ సిగ్నల్స్ శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, పోలీస్ అధికారులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాగా మారిన తర్వాత పట్టణ అభివృద్ధి శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రధాన కూడళ్లలో 38 లక్షలతో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి నగర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, నాగరాజు, అడ్వకేట్ ప్రతాప్ రెడ్డి, బాబురావు, ట్రాఫిక్ సిఐ షేక్ ఇస్మాయిల్, సిఐలు, ఎస్ఐలు, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి : సిఐటియు

నిరసన చేపడుతున్న కాంట్రాక్టు కార్మికులు, సిఐటియు, యూనియన్ నాయకులు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కే. మహమ్మద్ గౌస్, కోశాధికారి పి.వెంకట లింగం, ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుల్లయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్ఎఆర్ఎస్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 4వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఆర్ఎఆర్ఎస్ ఆఫీసు ముందు కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకురాలు నాగేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టు కార్మికులు రాష్ట్రంలో లేకుండా రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ నేటికి నెరవేర్చకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్కాస్‌లో కార్మికులందరినీ చేర్చాలని, యూనివర్సిటీ పొలాల్లో పని చేసే సందర్భంగా ఏ ప్రమాదం జరిగినా అధికారులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, అరకొర వేతనాలతో సరిపెట్టడం సరైంది కాదన్నారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు అయ్యన్న ,రమణయ్య, దివాకర్, నాగరాజు, చిన్న నరసయ్య, సుజాత, రమ్య, చిన్న వెంకటలక్ష్మి, మాధవి, జ్యోతి, పార్వతి, లీలావతి, హసీనాబాను తదతరులు పాల్గొన్నారు.

# అమృత్ స్కీమ్‌ను నిర్వీర్యం చేశారు

- టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత నీటి ఎద్దడి నివారణకు చర్యలు : మాజీ మంత్రి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

టిడిపి హయాంలో భవిష్యత్తులో ఆళ్లగడ్డకు నీటి ఎద్దడి రాకుండా అమృత్ స్కీమును తీసుకొచ్చామని, అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ స్కీమ్‌ను పూర్తి చేయకుండా నిధులను నిర్వీర్యం చేసిందని, దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు. మంగళవారం భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆమె బొరుగుల బట్టి వీధి, గీత వీధి, అమ్మవారి శాల వీధి, సత్రం బజారులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ఉమ్మడి టిడిపి, జనసేన అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం బొరుగుల బట్టి వద్ద ఆగిపోయిన వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగిపోయిన ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేసి ఆళ్లగడ్డలో శాశ్వత నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసిపి ప్రభుత్వం సిద్ధం సభ మీద పెట్టిన దృష్టి ప్రజా సమస్యలపై పెట్టింటే బాగుండేదన్నారు. సిద్ధం కార్యక్రమం నిజంగా విజయవంతమై ఉంటే కవరేజ్ కోసం వెళ్ళిన విలేకరులపై దాడి చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రౌడీయిజం, గుండాయిజం, కమిషన్‌ల రాజ్యం ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాష, మాజీ కౌన్సిలర్లు సలాం, రమీజా, టిడిపి నాయకులు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి, నన్నెబై గారి జిలానీ, కందుకూరు మాధవరెడ్డి, భాస్కర్ యాదవ్, రామాచారి, ఇటిక్యాల శేఖర్ రెడ్డి, నగరం రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం నిలిచిన వాటర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

### సిఎం అదనపు కార్యదర్శిని కలిసిన చల్లా

ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ధనుంజయ రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

**ప్రజాశక్తి - అవుకు :** దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు, వైసిపి యువ నాయకుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అదనపు కార్యదర్శి ధనుంజయ రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బనగానపల్లె నియోజకవర్గ సమస్యలపై చర్చించినట్లు సమాచారం. వైసిపి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న యువ నాయకుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి సిఎం అదనపు కార్యదర్శిని కలవడం అవుకు మండలంలో చర్చనీయాంశంగా మారింది.

### వాలంటీర్ల కృషితోనే ప్రతి గడపకూ పథకాలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - రుద్రవరం :** గ్రామ వాలంటీర్ల కృషితోనే ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి కొనియాడారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఎక్కడో ఒకచోట తప్పు జరిగితే రాష్ట్రమంతా ఏదో తప్పు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు వాలంటీర్ల మీద రాద్ధాంతం చేసే పనిగా పెట్టుకున్నారని, అలాంటి వారు అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం సేవా రత్న పురస్కారాలకు ఎంపికైన ఐదుగురు గ్రామ వాలంటీర్లను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గద్దం రాఘవరెడ్డి, పుట్టాలమ్మ క్షేత్రం కమిటీ సభ్యుడు, వైసిపి సీనియర్ నాయకుడు గంగిశెట్టి తిమ్మయ్య శెట్టి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పరిచయం చేసుకుంటున్న డాక్టర్ దార సుధీర్

## గెలుపునకు కృషి చేయండి : ధార సుధీర్

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

తన గెలుపునకు సహాయ సహకారాలు అందించాలని వైసిపి నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అన్నారు. మంగళవారం నందికొ ట్కూరు పట్టణంలోని హాజీ నగర్ మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మన్సూర్ ఉపాధ్యక్షులు చింత విజ్జితో కలిసి 13వ వార్డులో వైసిపి నాయకులు, కార్యకర్తలను ఇంటింటికి వెళ్లి పరిచయం చేసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో.. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేయబోతున్నందుకు మీ సహాయ సహకారాలు ఉండాలని, నందికొ ట్కూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ అర్షపోగు ప్రశాంతి, వార్డు ఇంచార్జి పి.రమేష్, కో– ఆప్షన్ సభ్యులు కేశవరెడ్డి శ్రీనివాస రెడ్డి, మైనారిటీ జోనల్ ఇంఛార్జి అబూబక్కర్,జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, సులోచనమ్మ కౌన్సిలర్లు అబ్దుల్ రవూఫ్, మనపాడు అశోక్, లాలు ప్రసాద్, శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, రజిని కుమార్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డూ, బాండ్స్ శ్రీను, శాలి భాష, శాంతి రాజు, కురువ శ్రీను, సతీష్ రెడ్డి, సమీవుల్లా, ఆర్ట్ శ్రీను, మధుసూదన రెడ్డి, ఆశాం, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆశన్నగారి మధు, ముచ్చుమర్రి బాష, మాలిక్ తదీతరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీడీవో కవి రాజు

## వాలంటీర్ల సేవకు సన్మానం : ఎంపిడిఒ

**ప్రజాశక్తి - పగిడ్యాల**

వాలంటీర్ల సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారిని సన్మానించడం జరిగిందని ఎంపీడీవో కవి రాజు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వాలంటరీలకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కవి రాజు మాట్లాడారు. వాలంటీర్ల సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సేవారత్న, సేవ మిత్ర బిరుదులతో పథకాలను అందించిందన్నారు. మండలంలో 174 వాలంటీర్లకు గాను ఇద్దరు వాలంటరీలు రాజీనామా చేశారన్నారు. అందులో 172 మందికి సత్కరించడం జరిగిందన్నారు. ఐదు మందికి సేవారత్న సన్మానించి ధ్రువపత్రాన్ని అందించి రూ 30 వేల ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగతా 167 మందికి సేవ మిత్ర గా పథకాలను, ధ్రువపత్రాలు అందించి రఊ15 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాలంటీర్ల వల్ల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లు కీలక పాత్ర : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - గడివేముల**

సంక్షేమ పథకాల అమలులో గ్రామ, వార్డు వాలంటీర్లే కీలక పాత్ర పోషిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం గడివేముల మండలంలో పనిచేస్తున్న వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల వద్దకే అందించేందుకు గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీడీవో శివరామి రెడ్డి, గడివేముల ఉపసర్పంచ్ బాల చిన్ని, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు నంద్యాల వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, బిడుదురి నాగేశ్వర్ రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, గని ఆనంద్ రెడ్డి ,సొసైటీ చైర్మన్ పోగుల చంద్రశేఖర్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, మేఘనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ కాలు నాయక్, డాలు స్వామి, కృష్ణారెడ్డి ,రామ్మోహన్ రెడ్డి బండపల్లి రమేష్, శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి, కొర్రపోలురు సుబ్బారెడ్డి, గడిగరేవుల హుస్సేన్ బాష, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

## గుడిసె వాసులకు పక్కా గృహాలు నిర్మించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

నందికొట్కూరు పట్టణంలోని కర్నూల్ రోడ్ బిఆర్ఆర్ నగర్ గుడిసె వాసులకు ఇంటి పట్టాలు ఇచ్చి పక్క గహాలు నిర్మించి ఇవ్వాలని కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు మున్సిపాలిటీ కర్నూల్ రోడ్డు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో టీ గోపాలకృష్ణ అధ్యక్షతన విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009 నుండి 300 మంది పేదలు సర్వే నెంబర్ 589 590 595లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కులాలకు చెందిన పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారని, కాలనీలో విద్యుత్ స్తంభాలు, మంచినీటి సదుపాయం, రోడ్లు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆందోళన పోరాటాల ఫలితంగా కొన్ని కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించగా.. కొన్ని కుటుం బాలకు మాత్రమే మంచినీటి వసతి, రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అనేకమంది మౌలిక వసతులు లేకపోవడం వల్ల కాలనీలో నివాసాలు ఉండలేక టౌన్‌లో అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని తెలియజేశారు. అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేసి అనర్హులకు పట్టాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి అవక తవకలకు పాల్పడితే అధికారుల పైన సస్పెండ్ చేసే వరకు ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. నిజమైన పేదవారికి అర్హులైన వారికి మాత్రమే గుడిసెలు వేసుకున్న పేదవారికి మాత్రమే ఇంటి పట్టాలు ఇవ్వాలని లేనియెడల ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సిపిఎం కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ దామోదర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. స్పందించిన తహసిల్దార్ ఇచ్చిన దరఖాస్తులన్నీ విచారణ చేసి అర్హులైన పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ధర్నా కార్యక్రమాన్ని విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పి పకీర్ సాహెబ్, ఎం కర్ణ, నాగన్న ,బాలయ్య ,హుస్సేనమ్మ, మద్దమ్మ, ప్రసాద్, ఏసేపు, దాసు, గణేష్, బిచ్చన్న, విజయరాజు, దేవన్న, నాగరాజు, నాగశేషమ్మ, బుల్లెద్దుల రాజు, స్వాములు, త్యాగరాజు పాల్గొన్నారు.

అధికారులకు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న యేసురత్నం

## సిహెచ్‌డబ్ల్యులకు వేతనం రూ.10 వేలు ఇవ్వాలి

**- సిఐటియు డిమాండ్**

**ప్రజాశక్తి - ఆత్మకూరు**

ఆత్మకూరు: గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న వారిని ఆశ వర్కర్లుగా గుర్తించి నెలలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.యేసు రత్నం, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, శారద, లక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఆశా వర్కర్ల డ్యూటీలు చేస్తున్న సిహెచ్డబ్ల్యులను మాత్రం అతి తక్కువ వేతనాలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారి శ్రమను దోచుకుంటుందన్నారు. తమను ఆశ వర్కర్లుగా గుర్తించి పదివేల రూపాయల వేతనం ఇతర సౌకర్యాలు కల్పించాలని అనేక సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్న అధికారులు సమస్యలు పరిష్కరి స్తామని మాట చెప్పడం తప్ప ఆచరణలో చేయడం లేదన్నారు. ఆశా వర్కర్లతో సమానంగా పనిచేస్తున్న సిహెచ్డబ్ల్యులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, గిరిజన గూడాలలో గిరిజనులకు సేవలు చేస్తూ అధికారులకు అందుబాటులో ఉంటూ నెలలు తరబడి వేతనాలు రాకున్నా సేవ చేస్తున్నారన్నారు. సిహెచ్ డబ్ల్యు యులకు శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో గల వర్కర్లకు నాలుగు నెలల వేతనాలు పెండి ంగ్లో ఉన్నాయి వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సిహెచ్ డబ్ల్యూ లకు యూనిఫామ్ మెడికల్ కిట్లు సెల్ ఫోన్లు ఇవ్వాలని వారు కోరారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న వారికి బడ్జెట్ ఉన్న నెల వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ పీవో వెంటనే కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వెంటనే వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

## ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

**ప్రజాశక్తి-డోన్ :** డోన్ పట్టణ సమీపంలో కోట్లవారి పల్లెలోని గంగమ్మ గుడి నిర్మాణ ప్రాంతంలో గంగపుత్రల సంఘ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంగపుత్ర సంఘ గౌరవ అధ్యక్షులు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరయ్యారు. గంగమ్మ తల్లి గుడిలో పూజలు అనంతరం భీష్మని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగపుత్ర సంఘ ప్రెసిడెంట్ బెస్త వెంకటేశ్వర్లు,ప్రజా వైద్యశాల బెస్త మల్లికార్జున, మాధవస్వామి, ప్రవీణ్, రవికుమార్, విష్ణు, కృష్ణమూర్తి, పానిపూరి మురళి,ఎంజి మల్లికార్జున, చంద్రుడు, అంజి, రామకృష్ణ, గిరి,సోమయ్య, గంగపుత్ర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బేతంచెర్ల :** గంగపుత్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెలుగు వెంకటరమణ, టైలర్ ఎల్లయ్యల ఆధ్వర్యంలో ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భీష్మచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురుషోత్తం, షా రు మద్దయ్య, టైలర్ గంగన్న, రమణ, చిన్న ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భీష్మని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గంగపుత్ర సంఘ గౌరవ అధ్యక్షులు సప్తశైల రాజేష్

బేతంచెర్ల : భీష్ముని చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

## శ్రీశైలంలో నేడే మహా కుంభాభిషేకం

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలం క్షేత్రంలో మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాన్నిబుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గర్భాలయ గోపురాలకు, విమాన గోపురాలకు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల గోపురాలకు మహా కుంభాభిషేకాన్ని సంప్రదాయపద్ధంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేం దుకు గోపురాలకు దఢమైన పరంజాలను ఏర్పాటు చేయడం జరిగింది. వేద మంత్రాల మధ్య నిర్వహించే మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమానికి పలువురు మంత్రులు శాసనసభ్యులు పీఠాధిపతులు వంటి ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే ఉండేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హాజరయ్యే ప్రముఖులు రాత్రికి శ్రీశైలం చేరుకున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రబాబు

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి - రుద్రవరం**

మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సిరివెళ్ల సిఐ చంద్రబాబు మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాలలో ఉన్న 51 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రుద్రవరం, రెడ్డి పల్లె , తువ్వ పల్లి, గ్రామాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల సమయంలో పోలీసు భద్రత ఎలా కల్పించాలి, సిబ్బంది ఎంత అవసరమో తదితర విషయాలపై ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై నిరంజన్ రెడ్డి, ఏఎస్ఐ బాలన్న సిబ్బంది ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి అధికార ప్రతినిధి

## దళిత ద్రోహి సిఎం జగన్

**- జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే**
**- కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకోవాలి**
**- టిడిపి అధికార ప్రతినిధి కాకరవాడ వెంకటస్వామి**

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి దళితుల ద్రోహి అని జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడేనని, మాజీ మంత్రి గుట్కా కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకోవాలని ఇష్టానుసారంగా మాట్లాడితే సహించే ప్రసక్తి లేదని టీడీపీ అధికార ప్రతినిధి కాకరవాడ వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ విషయంలో స్పందించాల్సిన ఒక మాజీ మంత్రి కొడాలి నాని రౌడీ మూకలకు సపోర్టు చేస్తూ తన వైఖరిని చాటుకున్నారన్నారు. ఈయనే ఇలా ఉంటే ఇక పార్టీ అధినేత, ఆయన పరివారం ఎలా ఉంటారో అర్థం చేసుకోవచ్చన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ జర్నలిస్టులపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. ఇక సీఎం హోదాలో ఉన్న జగన్ తన మోసపూరిత మాటలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీతో పాటు అన్ని వర్గాల ప్రజలను మరోసారి మోసం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని, అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్ర విభజ సమయంలో కట్టుబట్టలతో నవ్యాంధ్రలో అడుగుపెట్టిన తర్వాత ఏపీలో అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. జగన్ వచ్చిన తర్వాత ఏపీ అప్పుల ఊబిలో కూరుకు పోయిందని ఎద్దేవా చేశారు. సొంత బాబాయిని చంపి రాజారెడ్డి వారసత్వాన్ని కొనసా గిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను మరోసారి మోసం చేసేందుకు తక్కువ పోస్టులతో టెట్, డీఎస్సీ విడుదల చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తట్టా బుట్టా సర్దుకుని వెళ్లేందుకు వైసీపీ నేతలు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల నాయకులు కర్నాటి శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి చిన్న పుల్లారెడ్డి నాగశేషులు శంకర్ మోహన్ రెడ్డి మాణిక్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అవార్డుకు ఎస్వీ చైతన్య విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణంలోని ఎస్వీ చైతన్య ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం షంషీర్ భాష రాష్ట్రస్థాయి ఇన్ స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ టి. రామసుబ్బారెడ్డి, చైర్మన్ వి. రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే. వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈనెల 11,12వ తేదీలలో నంద్యాలలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో జిల్లా సాయి ఇన్ స్పైర్ ప్రదర్శన జరిగింది. ఇందులో 175 పాఠశాలలు పాల్గొనగా బనగానపల్లె పట్టణం లోని ఎస్ వి చైతన్య విద్యార్థి ఎం. షంషీర్ భాష షోలార్ వాటర్ హీటర్ అనే ప్రాజెక్టు నిర్వహించిన ప్రదర్శన ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. రాష్ట్రస్థాయి ఇన్ స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థి షంషీర్ బాషను గైడ్ టీచర్ సుబ్బారెడ్డిని పాఠశాల కరస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి, చైర్మన్ రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఇన్ స్పైర్ అవార్డుకి ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్, చైర్మన్

## చెంచుల వ్యాపారానికి అనుమతులు ఇవ్వాలి

**ప్రజాశక్తి - శ్రీశైలం**

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చెంచులు టెంకాయల వ్యాపారాలు చేసు కునేందుకు అనుమతులు ఇవ్వాలని ఆశీర్వాదం అన్నారు. మంగళవారం శ్రీశైలం దేవస్థానం ఆఫీస్ నందు ఈవో పెద్దిరాజుతో కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాదం ఆయన కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆయనతో మాట్లాడుతూ.మహాశివరాత్రి సందర్భంగా వేలాదిమంది శివ భక్తులు కర్నూల్ ఆత్మకూరు మిదుగా వెంకటాపురం నుండి నల్లమల్ల ఫారెస్ట్ కాలి నడకతో శివ భక్తులు, సామాన్య ప్రజలు వస్తుంటారని వీరందరికీ మార్గమధ్యన మంచినీటి సదుపాయం, వైద్య సదుపాయం, తినుబండారాలు తీసుకునేందుకు అక్కడక్కడ చిన్న చిన్న షాప్‌లు ఏర్పాటు చెయాలన్నారు. పెచ్చెరువులో మంచినీటి సదుపా యాన్ని మెడికల్ క్యాంపుని దాతల సహకారంతోటి భోజన సదుపా యాలు కల్పించాలన్నారు. కైలాస ద్వారం దగ్గర శివ భక్తులు ప్రతి సంవత్సరము తాగడానికి మంచినీరు కోసం ఇబ్బందులు ఎదుర్కొ న్నారని గుర్తు చేశారు. స్పందించిన ఈవోసదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కొమరం భీమ్ చెంచు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కొలమయ్య, వీరన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇఒకు వినతి పత్రం ఇస్తున్న నేతలు

## మద్దిలేటి స్వామి భూముల కౌలు వేలంపాట

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానకు సంబంధించిన భూములను మూడు సంవత్సరాల కాలానికి గాను 2024–25 నుండి 2026–27 వరకు కౌలుకు రైతులు వేసుకోవడానికి బహిరంగ వేలంపాటను దేవస్థానం అధికారులు ఈవో ఎం రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో గత సంవత్సరము వచ్చిన ఆదాయం కన్నా రూ.188,000 అధికంగా ఆదాయం వచ్చిందని, ఇదే సర్వే నెంబర్‌లకు సంబంధి ంచిన ఆదాయం రూ.2,25,000 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

## పట్ర కులస్తుల కల ఫలించింది

**- మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలిపిన నేతలు**

**ప్రజాశక్తి - ప్యాపిలి**

పట్ర కులస్తులను బిసి డి నుండి బిసి ఎలోకి రిజర్వేషన్ మార్పును స్వాగతిస్తూ దశాబ్దం నాటి సమస్యను సులభంగా పరిష్కరించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి, గ్రామ సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మకు పట్ర కులస్తులు మంగళవారం అభినందనలు తెలిపారు. మంత్రి సమక్షంలో సర్పంచి జొన్నగిరి సరోజమ్మను శాలువా కప్పి పట్ర కులస్తులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్ర కులస్తులు మాట్లాడుతూ పట్ర కులస్తుల కల దశాబ్ద కాలంగా పోరాటానికి ఫలితం లభించిందన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అండగా నిలవడంతో పెండింగ్‌లో ఉన్న ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ప్యాపిలి మండలంలోని చంద్ర పల్లి గ్రామంలో పట్ర కులస్తులు అధికంగా ఉన్నారని, హుసేనాపురం, పిఆర్ పల్లిలో కొన్ని కుటుంబాలు నివసిస్తున్నారని, సంచార జాతులలో వెనుకబడిన కులాలలో పట్రకులం ఒకటి అని అన్నారు. రాష్ట్ర నేతలు హనుమంతు నాయుడు శ్రీనివాసులు నాయుడు, నంద్యాల జిల్లా పట్ర సంఘం అధ్యక్షుడు ఉప్పలపాటి మద్దేశ్వరయ్య తదితరులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారన్నారు. పట్ర కులస్తులకు బహుళ ప్రయోజనాలు కలిగే విధంగా దివంగత ముఖ్యమంత్రి వైయ స్సార్ పరిపాలనలో ప్రత్యేక జీవో తెచ్చి బిసి డి కింద కొనసాగుతున్న పట్ర కులస్తులను బిసి ఏలోకి చేరుస్తూ జీవో ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. దీంతో ఇప్పటికే కొందరు పట్ర కులస్తులకు విద్యుత్ రాయితీ అమలు అవుతోంది. ఇతరులకు కూడా దరఖాస్తు చేసుకున్న వారందరికీ విద్యుత్ రాయితీ కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగాల భర్తీ విషయంలో, ఉన్నత విద్యాసంస్థలలో రిజర్వేషన్లు పొందేందుకు పట్ర కులానికి అవకాశం మరింత పెరుగుతుందన్నారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని పట్ర కులస్తులు హామీ ఇచ్చారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న పట్ర కులస్థులు

## బ్రిడ్జి నిర్మాణానికి భూమి

**ప్రజాశక్తి - రుద్రవరం**

మండల పరిధిలోని పేరూరు గ్రామంలోని పేరూరు, సిరివెళ్ళ రస్తాలోని వక్కిలేరు వాగులోని వంతెన నిర్మాణానికి ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల గంగుల బ్రీజేంద్రారెడ్డి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. పిఎంజిఎస్‌వై నిధులతో రూ893.92 లక్షలు వెచ్చించి బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరివెళ్ల, పేరూరు చుట్టుపక్కల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారని, వర్షాకాలంలో రహదారి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పేరూరు సిరివెళ్ల గ్రామ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలోనూ అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ పథకాలలో కులం మతం చూడకుండా పార్టీలు చూడకుండా ప్రామా ణికంగా భావించి అభివృద్ధి సంక్షేమం పథకాలు అమలు పరుస్తున్నామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బీజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పేరూరు సిరివెళ్ల గ్రామానికి స్థలమానికంగా ఉన్నటువంటి బ్రిడ్జి నిర్మాణానికి ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల నిరీక్షణ నేడు సహకారమైంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

## ఓటర్ లిస్టు వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

**- టిడిపి క్లస్టర్ ఇంచార్జులతో సమావేశంలో గౌతంరెడ్డి**

**ప్రజాశక్తి-డోన్**

ఓటర్‌లిస్టు వెరిఫి కేషన్‌ను క్లస్టర్ , యూనిట్ బూత్ ఇన్‌ఛార్జులు పకడ్బందీగా నిర్వహించాని డోన్ టిడిపి నియోజకవర్గ యువ నాయకుడు మన్నెధర్మవరం గౌతంరెడ్డి సూచించారు. ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ పై డోన్ పట్టణ టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జులతో సమావేశాన్ని డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు డోన్ పట్టణ టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జులతో ఓటర్ లిస్టు వెరిఫికేషన్ అంశం పై డోన్ పట్టణ టిడిపి కార్యాలయంలో డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌతమ్ రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు హాజరయ్యారు. అనేక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్,యూనిట్, బూత్ ఇంచార్జులు పాల్గొన్నారు.

సమావేశంలో మాటాడుతున్న గౌతంరెడ్డి

## విలేకరులపై దాడి దారుణం

**- సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం**

**ప్రజాశక్తి - చాగలమర్రి**

మన చుట్టూ ఉండే సమాజంలో మంచి, చెడులను ప్రజలకు తెలియజేసే పత్రికా విలేకరులపై దాడులకు పాల్పడం దారుణమని సీమాంధ్ర సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మహబూబాబాషా, జిల్లా కన్వీనర్ సల్లానాగరాజు తెలియజేశారు. చాగలమర్రి పట్టణంలోని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయ సమీపంలోని రహదారిపై మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైకాపా అల్లరిమూకలు దాడికి పాల్పడ్డం హేయమైన చర్య అన్నారు. అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు పీరయ్య, పెద్దబాష, బాబు, బాలదస్తగిరి, బాషా, ఆలీ, రంగప్ప, పిచ్చన్న, మస్తాన్, బ్రహ్మయ్య, మధు, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

రహదారిపై నిరసన తెలియజేస్తున్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నేతలు

## వాలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శం : వైసిపి

**ప్రజాశక్తి - పగిడ్యాల**

దేశానికి ఆదర్శం వాలంటరీ వ్యవస్థ అని వైసిపి నందికొట్కూర్ నియోజవర్గ ఇన్చార్జి ధార సుధీర్, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి అన్నారు. మంగళవారం వాలంటరీకి వందనం కార్యక్రమం భాగంగా వాలంటరీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి ధారా సుధీర్, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, జడ్పిటిసి పుల్యాల దివ్య మాట్లాడారు. దేశంలోనే వాలంటరీ వ్యవస్థ ఎంతో ఆదర్శంగా నిలిచిందని వాలంటరీ వ్యవస్థ వల్ల అన్ని సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయని వారు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటరీ వ్యవస్థ ఏర్పాటుచేసి ప్రజల చెంతకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. అంతకుముందు బీరవోలు గ్రామంలో జరుగుతున్న జగన్ అన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అనంతరం సేవారత్న కు, సేవా మిత్ర కు ఎంపికైన వాలంటరీలను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కవి రాజు, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్ర రెడ్డి, సమత యశోదర, వీరన్న యాదవ్, జావిద్ భాష వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

# ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం
ప్రత్యేక అనుబంధం

బుధవారం 21, ఫిబ్రవరి 2024

# నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్**

ప్రపంచంలోని వివిధ జాతుల ప్రజల మధ్య అవగాహన, పరస్పర సమాచారం ఇచ్చిపుచ్చుకొనే క్రమాన్ని, వివిధ జాతుల, భాషా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకొని, ఆ వారసత్వ సంపదను మనకు అందించిన ఆయా జాతుల సంస్కృతుల, భాషల ప్రభావాన్ని విస్తరింపచేయాల్సిన ప్రాధాన్యాన్ని గుర్తించిన 'యునెస్కో'-ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సంస్థ 1974-1976 సంవత్సరాలలో 18, 19వ సమావేశాల్లో ద్విభాషా విద్యాబోధనను బలపరుస్తూ కొన్ని తీర్మానాలను ఆమోదించింది. యునెస్కో కార్యనిర్వాహక మండలి 1998 అక్టోబరులో బహు భాషా విద్యలకు ఒక సలహా కమిటీని నియమించింది. అదే సంవత్సరం యునెస్కో డైరెక్టరు జనరల్ విద్యారంగంలో 'భాషా విభాగాన్ని' ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో 1999 నవంబర్ 17న జరిగిన యునెస్కో 30వ సర్వ ప్రతినిధి సభ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీ 'అంతర్జాతీయ మాతృ భాషా దినంగా పాటించాలని ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ తీర్మానం వెనుక నేపథ్యం, అమిత ఉత్తేజకరం, అత్యంత స్ఫూర్తిమంతంగా ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినంగా ప్రకటించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం, యునెస్కోను అభ్యర్థిస్తూ ఒక ప్రతిపాదన పంపింది. భారత్, పాకిస్తాన్, శ్రీలంకతో సహా 28, ఆఫ్రో, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలు ఆ ప్రతిపాదనను బలపరిచాయి. కెనడాలో 'ప్రపంచ మాతృభాషా ప్రేమీమండలి' అనే ఒక సంస్థ వుంది. అందులో ఇంగ్లీషు, కుచి, కాంటనీస్ జర్మన్, ఫిలిప్పినో, బెంగాలీ, హిందీ భాషలు మాట్లాడే ప్రతినిధులు *(మిగతా 2లో..)*

# బెంగాలీ భాషకు విస్తృత గౌరవం

భారతదేశం బహుభాషా దేశం. జాతీయ గీతం జనగణ మన, జాతీయ గేయం వందేమాతరం బెంగాలీ భాషలోనే ఉన్నాయి. విభిన్న సాంస్కృతిక మూలాలు గల మనదేశంలో బెంగాలీ భాషకు గల విస్తృతి, సాహిత్య సాంస్కృతిక వైభవం ఈ భాషకు అంతటి గౌరవాన్ని తెచ్చింది. బెంగాలీ భాష మూలాల 17వ శతాబ్ది నాటి మగధ, ప్రాకృత, పాళీ, సంస్కృత భాషల్లో ఉన్నాయి. 19వ శతాబ్ధికి పూర్వం ఎక్కువగా అనువాద సాహిత్యమున్నప్పటికీ అనంతరం కవిత్వం, కథానిక, నవలలు, నాటకాలు బెంగాలీ సాహిత్య చిత్రాన్ని బహువర్ణ మిళితమయిన సుందర దృశ్య కావ్యంగా మలిచాయి. విప్లవ జ్వాలలు రగిలించి భారత స్వాతంత్ర్య పోరాటంలో స్ఫూర్తిగా నిలిచాయి. గురుదేవులు రవీంద్ర కవీంద్రులు, శరత్ చంద్ర చటర్జీ, బంకిమ్‌చంద్ర చటర్జీ, కాజినజురుల్ ఇస్లాం వంటి గొప్ప సాహితీ వేత్తలు బెంగాలీ భాషను 20 వ శతాబ్దిలో స్వర్ణ యుగం గా మలిచారు. కలకత్తా వాసిగా బెంగాలీ మాతృభాషను కలిగి ఉండటం, నేను ఎంతో గర్విస్తున్నాను. ముగ్గురు యువ భాషా ఉద్యమ కారులు మాతృభాషనే మాట్లాడతా మని పోరాడి తమ జీవితాన్ని త్యాగం చేసినందుకు 1952లో యునెస్కో ఫిబ్రవరి21 తేదీని అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంగా ప్రకటించింది. నేటికీ పశ్చిమ బెంగాల్‌లో బెంగాలీ అధికార భాషగా వెలుగొందుతున్నది. ఆంగ్లం ఎంత ప్రాచుర్యంలో ఉన్నా నా మాతభాషను నేను ప్రేమించి గౌరవిస్తాను, శిరస్సు వంచి పాదాభివందనం చేస్తాను.

మొదర్ గరబ్, మొదర్ ఆషా
ఆ మోరి బంగ్లా భాషా
తోమర్ కోలే, తోమర్ బోలె
కొనతోయి శాంతి ,భాలో భాషా...

**డోలా సాహ**
**అధ్యాపకులు, మాంటేస్సోరి పాఠశాల,**
**కర్నూలు.**


NICE
COMPUTER EDUCATION
& VOCATIONAL, SKILL TRAINING INSTITUTE
గత 33 సం॥గా అత్యుత్తమ కంప్యూటర్ శిక్షణనిస్తూ అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన సంస్థ.
MS OFFICE, D.T.P., TALLY, COMPUTER MECHAISM,
C,C++, PYTHON, JAVA, VB, VC++, ORACLE, .NET,
DATA STRUCTURES IN C & C++,
COMPUTER TEACHER TRAINING COURSE,
MULTIMEDIA & ANIMATIONS, AUTOCAD,
SPOKEN ENGLISH & COMMUNICATION SKILLS
CELL : 9396861308
Ashok Nagar, Tanishq Function Hall Line, Kurnool.

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు...
" దేశభాషలందు తెలుగు లెస్స "
కర్నూలు జిల్లా ప్రజలకు ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు...
డా॥ ఫమిద బేగం
అధ్యాపకులు,
తెలుగు భాష విభాగం,
సిల్వర్ జూబ్లీ కళాశాల,
కర్నూలు.

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు...
" దేశభాషలందు తెలుగు లెస్స "
కెంగార మోహన్ - రాష్ట్ర అధ్యక్షులు,
జంధ్యాల రఘుబాబు - రాష్ట్ర కార్యదర్శి
కర్నూలు జిల్లా ప్రజలకు, సాహితీ వేత్తలకు, సాహితీ ప్రియులకు, కవులకు, రచయితలకు, అధికారులకు ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు...
ఎం.పి బసవరాజు - జిల్లా గౌరవ అధ్యక్షులు
ఆవుల బసప్ప - జిల్లా అధ్యక్షులు
ఆవుల చక్రపాణి యాదవ్ - జిల్లా ప్రధాన కార్యదర్శి
డి.అయ్యన్న - సాహిత్య ప్రస్థానం జిల్లా కన్వీనర్
ఎస్.నాగమణి - జిల్లా నాయకురాలు
డా॥ సర్విరి భాస్కర్ - జిల్లా నాయకులు
ఎస్.సుధాకర్ - జిల్లా నాయకులు
సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా కమిటీ

నంద్యాల జిల్లా ప్రజలకు
ఫిబ్రవరి 21 అంతర్జాతీయ
మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు...
" దేశభాషలందు తెలుగు లెస్స "
ఎం. శ్రీనివాసమూర్తి,
అధ్యక్షులు, సాహితీ స్రవంతి, నంద్యాల జిల్లా.
అన్నెం శ్రీనివాస రెడ్డి,
అవ్వారి శేషఫణి,
ఎల్.ఎన్.నీలకంఠమాచారి,
కొప్పుల ప్రసాద్,
మాబు బాషా,

# నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

*(మొదటి పేజీ తరువాయి..)*

సభ్యులుగా వున్నారు. వారు కూడా ఫిబ్రవరి 21ని 'అంతర్జాతీయ మాతృ భాషాదినం'గా ప్రకటించాలని ఐక్యరాజ్య సమితిని, యునెస్కోను ఆర్థించారు. ఈ నేపథ్యంలోనే నవంబరు 17, 1999న యునెస్కో సర్వ ప్రతినిధి సభ-ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినంగా ప్రకటించింది.

**గత చరిత్ర :**

స్వాతంత్ర్య పోరాటం తర్వాత దేశ విభజనలో 'బంగ్లాదేశ్ తూర్పు పాకిస్తాన్‌గా పిలుస్తుండేవారు. బంగ్లాదేశ్ ప్రజలు బెంగాలీ భాషను పాకిస్తాన్ అధికార భాషల్లో ఒకటిగా గుర్తించాలని ఉద్యమం ప్రారంభించారు. బెంగాలీ మాతృభాషా ఉద్యమం ఉధృతమై-1952 ఫిబ్రవరి 21న బెంగాలీ ప్రజలు బ్రహ్మాండమైన ప్రదర్శన ఊరేగింపు జరిపారు. ఆ రోజున పాకిస్థాన్ ప్రభుత్వ పోలీసులు కాల్పులు జరిపారు. దానిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. 1953 మొదలు, నేటి వరకు ఫిబ్రవరి 21ని బంగ్లాదేశ్ ప్రభుత్వం మృతవీరుల దినంగా స్మరిస్తోంది. వారి స్మారకార్థం నిర్మించిన మెమోరియల్ జాతీయ సమావేశ స్థలంగా ప్రసిద్ధి పొందింది. మాతృ భాష బెంగాలీ అన్నా, వంగ సంస్కృతి అన్నా ఈ అమర వీరులు ప్రజానీకంలో ప్రేరేపింపజేసిన ప్రేమ, గౌరవాలే అంతిమంగా, బంగ్లాదేశ్ విమోచన సమరానికి పునాదులు వేశాయి. 1956లో నాటి పాకిస్తాన్ రాజ్యాంగం, బెంగాలీ, ఉర్దూలను అధికార భాషలుగా ప్రకటించింది. 1972లో బంగ్లాదేశ్ రూపొందించుకున్న రాజ్యాంగం బెంగాలీని బంగ్లాదేశ్ గణతంత్ర రాజ్యభాషగా ప్రకటించింది. ఈ పరిణామాన్ని దృష్టిలో పెట్టుకున్న 'యునెస్కో' భాషా బాహుళ్యానికి ప్రేరణగా ఉండే అంతర్జాతీయ స్వభావం గల సామాజిక, వివేక విలసిత మీడియా వాతావరణానికి అవసరమైన పరిస్థితులను సృష్టించాల్సిందిగా యునెస్కో సభ్యదేశాలకు సిఫార్సు చేసింది. అన్ని జాతుల ప్రజలకు భాషాజ్ఞానం, సంస్కృతి ప్రజాస్వామ్య బద్ధంగా అందుబాటు కావడానికి, బహుభాషా విద్యా బోధనను సభ్యదేశాలు ప్రోత్సహించాలని సిఫారసు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా యువతను విద్యావంతుల్ని చేయడం ద్వారా సంస్కృతుల మధ్య అసాధారణ సంభాషణలో వారు పాలుపంచు కొంటారు. గ్రాహ్యకశక్తి పెరుగుతుంది. తద్వారా సహనం, పరస్పర గౌరవం వారి మనసుల్లో నాటుకొంటుందని యునెస్కో విశ్లేషించింది. భాషోచ్చారణ, వ్యాకరణ నిపుణతను అలవర్చుకొనే బాలల, శక్తి, సామర్థ్యాలు పెంపొందాయని యునెస్కో గుర్తించింది. ఈ నైపుణ్య కారణంగా బాలలు చిరుప్రాయంలోనే క్రియాశీలకమైన సాత్వికమైన, యదార్థభావ ప్రసారంలో, అవగాహనలో పటిమను సంపాదించ గలుగు తారని యునెస్కో విశదీకరించింది. ద్విభాషా విద్యా బోధనకు మద్దతుగా ఆమోదించిన పూర్వ తీర్మానాలను మననం చేసుకుని అంతిమంగా 1999లో యునెస్కో 12వ తీర్మానం, 'అంతర్జాతీయ మాతృ భాషా దినం'గా ఆమోదించింది. 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ' స్ఫూర్తి మనందరి మాతృభాష పట్లనే కాకుండా ప్రపంచంలోని తోటి సోదరీ సోదరులందరి మాతృభాషల పట్ల కూడా ప్రగాఢ గౌరవ భావం కలిగించడానికి దోహదం చేస్తుందని, అలాగే అధిక సంఖ్యాక ప్రజల భాషల వికాసానికి తోడ్పడుతుందని, ఒక భాషపై ఇంకోభాష పెత్తనానికి, ఆధిపత్యానికి అంతం పలకాలని ఆశిద్దాం.

## తెలుగు తల్లి

మాతృమూర్తీ మాతృభూమీ మాతృభాష
వైశిష్ట్యాలను వర్ణించడమే ఒక చిత్రం
వాటి కీర్తి సర్వకాలం అజరామరం
తెలుగు భాష గొప్పదనం
తెలియపరప ఎవరితరం
వినువీధిన కనువిందుగ
సలుపుతోంది నర్తనం
పాలసంద్రంలో కలిపారట
బృందారకులు ఆంధ్రాన్ని
బుస బుసలతో పొంగిందట
అమరత్వపు పియూషము
పరభాషా కిరీటధారి అన్నాడట
మన భాషను సుందర తెలుంగని
పరదేశపు పండితుడొకరు
మెచ్చాడట తెలుగు సొగసు
ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని
కవిత్రయపు మిత్రుత్వం
ప్రబంధ కవుల పాండిత్యం
వీరేశలింగ విహారం
గిడుగు గురజాడలు
జాషువా శ్రీ శ్రీల సమరభేరి
యువశక్తి దీప్తికి ప్రచోదనం
కొత్త పుంతలు త్రొక్కుతూ
నేటి తెలుగు వెలుగుతోంది
తెలుగు జీవ పంటకు
క్రొత్త వంగడాలు సృష్టిద్దాం
తెలుగు తల్లి పాదాలకు
నీరాజనాలు అర్పిద్దాం
తెలుగు సారస్వత వైభవాన్ని
దశ దిశలా చాటుదాం.

**గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి.**
**- 9110595847**

## పూర్ణకుంభరాశి

### కోటి పుణ్యమ్ముల నా తెలుగు

.........
**విశ్వద్వారముననిి**
**వింత వాదన చేయు**
**ఆంగ్ల విపరీతమునకు ఆంధ్రమ్ము నవ్వుకొనె!**
**పై పలుకులే నీవి హృదయ భావము నాది**
**ద్వారమీదైన నే తెరుచుతాళమ్ము నెనె.**

**గిడుగు రామ్మూర్తి రాష్ట్రస్థాయి అవార్డును అందుకుంటున్న డాక్టర్ దండెబోయన పార్వతీ దేవి (ఫైల్)**

## తెలుగుభాషకు పునర్వికాసం

తెలుగు వెలుగుల మహోదయం!
తెలుగు జాతికినవోదయం!!
అమ్మ భాషకు అమృతాభిషేకం!
అందుకుందాం పునర్వికాసం!!

గొడవలు ఇచ్చి గాయం రేపే
కులమతాల గొడవెందుకు రా?
తెలుగువారి నొక్కటి చేసే
తెలుగు భాష బహుపసందు రా!

పలికినంత పరవశమిచ్చే
తెలుగు భాష మధురం మధురం!
తెలుగు పలుకు వినిపిస్తేనే
తెలుగుజాతి పదిలం పదిలం!!

తరతరాల చరిత్ర గతిలో
వ్యాపించిన భాషా గంధం!
యుగయుగాల సంస్కృతిఝురిలో
జాతి శ్వాస తెలుగుమరందం!!

సమసమాజమార్గం చూపే
సాహిత్యం తెలుగుకు సొంతం!
తెలుగు భాష అభ్యున్నతికై
విక్రమిద్దాం అవిశ్రాంతం!!

ప్రపంచాన ఎక్కడ ఉన్నా
భాషిద్దాం తెలుగు భాషలో!
అంతరాలు మనకెన్నున్నా
ఒకటవుదాం తెలుగు నీడలో!!

ఎదిగే మన తెలుగు తేజములు
ఆదమరచ తెలుగు తోటలో!
సుప్రభాత మంగళ రవములు
ధ్వనించాలి గుండె గూటిలో!!

**రచన : డాక్టర్ తొగట సురేశ్ బాబు**
**ప్రధానోపాధ్యాయులు**
**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**
**ఎన్.ఎన్. కాలనీ, డోన్,**
**నంద్యాల జిల్లా.**

# మాతృభాష మధురమైనది

మాతభాష అనేది అమ్మ పాలంత మధురమైనది. పవిత్రమైనది. ప్రతి మనిషి తన మాతృ భాషను నేర్చుకోవాలన్నారు రవీంద్రనాథ్ ఠాగూర్. మాతృభాష తృణీకారం అంటే మాతృదేవి తిరస్కారంతో సమానం అన్నారు మహాత్మాగాంధీజీ. మాతభాష ప్రాధాన్యాన్ని తెలియ చెబుతున్న ఈ మాటలన్నీ అమ్మ భాష పై అలసత్వం ఉండకూడదన్న సూచన చేస్తున్నాయి. మన మాతృభాష అయినా తెలుగు పట్ల సమాజంలో నానాటికి అలసత్వం పెరుగు తుండటం విచారకరం. అనుసంధాన భాషలు, అంతర్జాతీయ భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికి మాతృ భాషను మరువకూడదు. మాతృభాషలో విద్యాబోధన జరిగినప్పుడే పిల్లలపైన వత్తిడి ఉండదు. ఎక్కువ విషయ జ్ఞానం సంపాదించడానికి సైతం మాతృభాష దోహదం చేస్తుందని మానసిక శాస్త్రవేత్తలు చెబుతారు. వ్యక్తి సమగ్ర వ్యక్తిత్వవికాసం జరగడానికి మాతృభాష తొలి సోపానం అవుతుంది. ఏ భాషీయులైన వారి వారి మాతృభాషల పట్ల మమకారాన్ని కలిగివుండి, ముందు తరాలకు అందించినపుడే ఆ భాషీయుల ఉనికి, అస్తిత్వం నిలబడగలుగుతుంది అనేది చారిత్రక సత్యం. సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు మొదలైనవన్ని మాతృభాష ద్వారానే పదిలం చేయబడతాయి. నేటి తరానికి మాతృభాష మాధుర్యాన్ని, ప్రాధాన్యతను, ఆవశ్యకతను బాల్యదశలోనే తెలియజేయాల్సిన అనివార్యత నేడు ఎంతైనా ఉంది. అందరికి ప్రపంచ మాతృభాషాదినోత్సవ శుభాకాంక్షలు.

**డాక్టర్ వి. వింధ్యవాసినీ దేవి**
**తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల**
**క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు.**

## నా తెలుగు భాష

తేనె చినుకుల తియ్యదనం
తెలుగు అక్షరాల కమ్మదనం
పలికితే చాలు. పన్నీటి జల్లుల చల్లదనం
గుండెలో దాచుకునే అమ్మతనం
అదే నా భాషలోని గొప్పతనం
నా మాతృభాషాక్షరాలు
తెలుగు వినీలాకాశంలో మెరిసే నక్షత్రాలు
నేడు నా భాషాక్షరాలు విలవిల లాడుతున్నాయి
56 తెలుగక్షరాలకు -26 ఆంగ్లక్షరాలకు
అనాదిగా
అవిశ్రాంతంగా పరుగు పందాలే
కాస్త వెనుకబడినట్టు అనిపించిన
మళ్లీ పౌరుషంతో ముందుకు దూసుకెళ్లే
వీర ప్రయత్నంలో నా తెలుగక్షరాలు
పరభాష వ్యామోహం నీకెందుకురా
పండు వెన్నెల వెలుగుల తెలుగు భాష నీదిరా
తెలుగుతనం నీదిరా - తెలుగు తేజం నీదిరా
తెలుగు భాష నాదని వెలుగెత్తి చాటరా
తెలుగు తల్లి చరణాలకు ప్రణమిల్లి పాడరా
తెలుగు పాట పాడరా - తెలుగు మాట నీదిరా

**డాక్టర్ ఫామిదా బేగం, తెలుగు అధ్యాపకులు**
**సిల్వర్ జూబ్లీ కళాశాల, కర్నూలు**

# మాతృ భాషను ప్రోత్సహించాలి

మన మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాశక్తి ప్రోత్సాహంలో భాగంగా ప్రతి ఒక్కరు కూడా మాతృభాషను ప్రోత్సహించాలి.ఎవరి మాతృభాషలో వాళ్ళు వ్యాపార ప్రసారాలు, బోర్డులను పెట్టుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మార్పు వచ్చి సర్క్యులర్, గవర్నమెంట్ పథకాలను, దరఖాస్తులను మాతృభాషలోనే తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ దగ్గరనుంచి ప్రతి ఒక్క ప్రభుత్వ ఆఫీస్ అధికారి మాతృభాషలోనే కచ్చితంగా దఢ సంకల్పంతో అమలు చేయడానికి ప్రయత్నం చేయాలి. మాతృభాషను ప్రోత్సహించడానికి చిన్నపిల్లల దగ్గర నుంచి ప్రతి స్కూలు ఉపాధ్యాయుడు అలాగే ప్రతి ఒక్క వ్యక్తి కూడా ప్రాథమిక హక్కుగా భావించి ఉద్యమించాల్సిన అవసరం ఉంది. మన మాతృభాషను గౌరవించే విధంగా పిల్లలకు చిన్ననాటి నుండే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నేర్పించాలి. మాతృభాషకు ప్రాధాన్యతనిస్తూ మిగతా భాషల పట్ల దృష్టి కేంద్రీకరించాలి తప్పా మన మాతభాషను తగ్గించి ఇతర భాషలను ప్రోత్సహించడం అనేది సరయినది కాదు. ఇప్పుడు పిల్లల్లో మాతృభాషపై గౌరవం తగ్గిపోవడానికి కారణం మంచి ఉద్యోగం సంపాదించు, భవిష్యత్తు కావాలనుకున్నప్పుడు ఇంగ్లీషు నేర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాబట్టి ఇంగ్లీష్ ఉంటేనే భవిష్యత్తు బాగుంటుంది అనే ఆలోచనతో మాతృభాషకు ప్రాధాన్యత తగ్గింది. ప్రతి ఒక్క ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ సమస్యగా మారింది. కాబట్టి సివిల్ సర్వీసు నుంచి ప్రతి ఒక్క ఎగ్జామినేషన్ కూడా తెలుగులో ఉన్న పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వం ఆ విధంగా చేసినప్పుడు ఇప్పుడు మనకు ఏదైనా బుక్ కావాలి అంటే ప్రతి చోట ఇంగ్లీషులోనే అందుబాటులో ఉంది. ప్రభుత్వ ఉద్యోగ యమకాల పరీక్షలు వాటి సిలబస్తులు మాతృ భాషలోకి అనువదించి అందుబాటులోకి తీసుకురావాలి. అలాగే ప్రతి ఒక్క పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల దినపత్రికలను చదివించడానికి ఎక్కువ ప్రాధాన్యతని ఇస్తున్నారు వాటితో పాటు తెలుగు దినపత్రికలను కూడా అందించి చదివించాలి. అంతేకాకుండా ప్రతి ఒక స్కూల్లో మాతృభాష పత్రికలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి ఒక టైం కేటాయించి ఆ టైంలో పత్రికలు చదివే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు ఉపాధ్యాయులు ఖచ్చితంగా మాతృభాషపై పట్టు దొరుకుతుంది. విద్యార్థుల అభివృద్ధి పథంలో నడవడమే మాత్రమే కాకుండా మాతృభాషపై అభిమానాన్ని పొందుతారు. మాతృ భాష అభివృద్ధికి దోహదం చేసే విధానం ఆ దిశలో కొనసాగాలని కోరుకుంటున్నాను.

**- రాయపాటి శ్రీనివాసరావు (నైస్ కన్వెటర్స్)**

## కవిత

వేలాది కవుల సాహిత్య వెలుగులో
దేశవిదేశాల్లో కాంతు లీను తున్న
భాష, విస్తతమై, విశ్వ వ్యాప్తమై
అనేక భాషల, భావాల సంగమ
నదియై, నిత్య జీవ నదియై మహా
సముద్రమయిన మాత భాష...
నా తేట తేనెల తెలుగు భాష.

**మాతృ భాషా దినోత్సవ శుభాకాంక్షలు**
**డా. బి. వి. స్వరూప్ సిన్హా.**

# ఉర్దూ భాష అభివృద్ధే లక్ష్యం

- అబ్దుల్ అజీజ్,
అయ్యలూరు గ్రామ ఉర్దూ
పాఠశాల ప్రధానోపాధ్యాయులు

రాష్ట్ర ఉత్తమ అవార్డును ప్రశంశా పత్రాలను అందుకుంటున్న దృశ్యం

**ప్రజాశక్తి - నంద్యాల**

ఉర్దూ భాష అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా గత రెండు దశాబ్దాలకుపైగా ఉర్దూ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నానని అయ్యలూరు గ్రామ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నేడు బుధవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

తనకు చిన్నతనం నుండి ఉర్దూ భాష పట్ల ఉన్న ప్రత్యేక మక్కువ కారణగా ఉర్దూ భాషను అభ్యసించి ఉర్దూ పాఠవాల ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించి, ఉర్దూ పాఠశాలల అభివృద్ధి, ఉర్దూ భాష అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నానని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా తను పడ్డ కష్టాన్ని, తను సాధించిన విషయాలను పంచుకుంటూ ఉర్దూ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతి కోసం జోయా సంస్థను నెలకొల్పి టిటిసి, బిఎడ్, డిఎస్సి, టెట్ వంటి పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తు న్నామని తెలిపారు. ఉర్దూ భాష అభివృద్ధికి కరవాన్-ఇ-ఉర్దూ సంస్థను నెలకొల్పి కన్వీనర్‌గా ఉంటూ ఉర్దూ కవి సమ్మేళనాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు ప్రముఖ ఉర్దూ రచయితల జయంతి, వర్ధంతులు నిర్వహిస్తూ వారు చేసిన సేవలను ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 58 ఉర్దూ ప్రాథమిక జిల్లా రిసోర్స్ పర్సన్‌గా ఉంటూ ఉర్దూ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతో పాటు రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గ్రూపులో ఉంటూ ఉర్దూ టెక్స్ బుక్‌లను రూపొందించడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నానని అన్నారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుండి ఉత్తమ రచయితగా అవార్డు జిల్లా స్థాయిలో తీసుకున్నానన తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో తాను రాసిన వ్యాసాలు ఎంతో గుర్తింపు సాధించాయని తెలిపారు. విద్యారతన్, పూలే వంటి అవార్డులతో పాటు ప్రభుత్వ పరంగా జిల్లా స్థాయిలో 3 అవార్డులు సాధించడంతో పాటు నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా తాను పని చేస్తున్న ఉర్దూ పాఠశాలను రాష్ట్రస్థాయిలో 5వ స్థాయిలో నిలిచే విధంగా కృషి చేశానని పేర్కొన్నారు.

# ప్రపంచీకరణ నేపథ్యంలో.. భాషా సంస్కృతులు

మానవ సంబంధాల్ని విచ్ఛిన్నం చేస్తూ నైతిక మానవతా విలువల్ని హత్య చేసే ఏకైక ఆయుధంగా ప్రపంచీకరణ అవతరించింది. మనిషి నుండి మనిషిని దూరం చేస్తూ ప్రపంచ మార్కెట్‌లో మనిషిని ఒక వస్తువుగా నిలుచుండబెట్టిన ఈ గ్లో'బలి'కరణలో బలవుతున్నది ముందుగా పేద, మధ్య తరగతి ప్రజలే. ప్రస్తుత మానవ సమాజంపై ముఖ్యంగా భారతీయ సమాజంపై జరుగుతున్న అసాంఘీక యుద్ధంలో ఎప్పటికి వాడిది పైచేయే. ఒక్కమాటలో చెప్పాలంటే అన్యాయం, అక్రమం, దోపిడి, బలహీనుడి మీద సవారీ చేయడమే ప్రపంచీకరణ సామ్రాజ్య వాద దోపిడీకి ఇది కొనసాగింపు. ప్రపంచీకరణ అన్నది పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీకి కొనసాగింపు అనే విషయం గత శతాబ్దాల చరిత్ర పుటలే మనకు సాక్ష్యంగా మనకు చెపుతాయి.

**నేపథ్యం :** వాస్కోడిగామా భారతదేశం పశ్చిమ తీరానికి 28.05.1498లో అడుగు పెట్టినప్పుడే మనదేశంలో సామ్రాజ్యవాదానికి బీజం పడింది. సుగంధ ద్రవ్యాలు, ప్రాకృతిక వనరులున్న సుసన్నమైన భారతదేశాన్ని అవలీలగా వ్యాపారంలో భాగంగా బానిస సమాజంగా సృష్టించగలిగారు. 1990 సోవియట్ యూనియన్ పతనంతో జూలు విధిల్చిన సింహంలా అమెరికా ఏకచత్రాదిపత్యానికి తిరుగులేకుండా తన చిరకాల స్వప్నమైన ఏకదృవ ప్రపంచాన్ని అన్నిదేశాలపైకి రుద్ది దానికి ప్రపంచీకరణ అని నామకరణం చేసింది. మానవజాతిపై మానసిక యుద్ధాన్ని చేస్తునే సమాజ పురోగమనంలో పెట్టుబడిదారీ విధానమే ఆఖరి దశ అంటూ విష ప్రచారం చేయడం మొదలుపెట్టింది. దేశాల్లో విచ్చలవిడి సంసస్కృతిని సృష్టించి మానవ సమాజంపై ఆర్థిక దాడి చేయించడం ప్రపంచీకరణలో మొదటి మెట్టు. పెప్సి, కోలా, పాశ్చాత్య టెలివిజన్ ఛానళ్ళు, సినిమాలు, విదేశీ దుస్తులు, సాంకేతిక విజ్ఞానం సాయంతో మానవ సమాజం పైకి ఉసిగొలిపి అవలీలగా, అలవోకగా మానవత నుండి మనుషుల్ని దూరం చేసింది. ఈ స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ఏకైక లక్ష్యం దురాశతో కూడిన లాభం. ఈ ధనార్జకు మనిషిని ఎంతటికైనా దిగజార్చేలా చేసేదే సామ్రాజ్యవాదం.

**భాషపై ప్రపంచీకరణ ప్రభావం :** ఆలోచన యొక్క తక్షణ వాస్తవికతే భాష అని మార్క్స్ మహనీయుడు ఏనాడో చెప్పాడు. అటువంటి భాష ఈరోజు ప్రపంచీకరణ విష విన్యాసానికి బలవుతూనే ఉన్నది. హిందీ భాష మాట్లాడే జనాభా తరువాత రెండవ అతి పెద్ద భాషగా దేశంలో 16 కోట్ల పైచీకులు మంది తెలుగు మాట్లాడుతున్నారు. ప్రపంచీకరణ పేరుతో మాతృభాషలపైన ఇంగ్లీషు నయా వలస సాంస్కృతిక దురాక్రమణకు తలపులు తెరిచారు. త్రిభాషా సూత్రం అన్నమాటే గాని అన్యాయం అయ్యింది. మాత్రం మాతృభాష తెలుగే. వర్ధమాన దేశాల మార్కెట్లను, తమ సరుకులను సంతలుగా మార్చుకొని వర్ధమాన దేశాల వస్తూత్పత్తులను దెబ్బతీసేందుకు ఒక సాధనంగా సమాచార సాంకేతిక వ్యవస్థలో భాగంగా ఇంగ్లీషు భాషనే వ్యాపార ప్రయోజనాలకు ప్రపంచీకరించాలనే అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాల్లో ఎత్తుగడలో భాగంగా మాతృభాషలపై జరగుతున్న దాడి ప్రపంచీకరణలో భాగంగా చేస్తున్నదే. 1999లో ఐక్యరాజ్య సమితి అనుబంధ విభాగం అయిన యూనెస్కో భాషా దురాక్రమణ వల్ల అంతరించిపోతున్న మాతృభాషల జాబితాలను విడుదల చేసి భాషల్ని రక్షించాలని హెచ్చరించింది. ఆంగ్ల సామ్రాజ్య వలస విధానం వల్ల దెబ్బతిన్న మాతృభాషలు క్రమేపి తమ అస్థిత్వాన్ని కోల్పోనున్నాయని హెచ్చరించింది. ఈ భాషా దురాక్రమణ దాడి గత 300 సంవత్సరాల నుంచి చేస్తున్నదే. తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునే క్రమంలో తాము నిర్వహిస్తున్న బ్రోకర్ పాత్రకు ఫెసిలిటేటర్ అనే పేరు తగిలించుకున్నది. బహుళజాతి విష సామ్రాజ్య విస్తరణలో మనల్ని భాగస్వాముల్ని చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. పరభాషల్ని పాలనలో అనుమతించే ప్రభుత్వాలను ఏ పేరుతో పిలవాలి. అమెరికా చేస్తున్న అకృత్యాలకు మన ప్రభుత్వాలు వత్తాసు పలకడమే ఈ దౌర్భాగ్యం. భాష ఒక మాధ్యమం, ఒక సాధనం వీటి సహాయంతోనే ప్రజలు ఒకరినొకరు తెలుసుకుంటారు. ఉత్తమ సమాజాన్ని నిర్మించుకునేందుకు భాష ఒక అత్యుత్తమ సాధనంగా ఉపయోగపడుతుంది. మానవ సంబంధాల్ని మానవీయ కోణంలో నడిపిస్తుంది. అటువంటి భాషను కలుషితం చేసే చర్యలు ఆధునిక సమాజంలో ఆరంభమయ్యాయి. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాష తెలుగు అత్యంత వేగంగా అంతరించేందుకు సిద్ధమవుతున్న వాస్తవం భాషాభిమానులు, భాషావేత్తలు నేడు గుర్తిస్తున్నారు. ఆంగ్లం వస్తే తప్ప సమాజంలో బతకలేమన్న ఒక భావజాలాన్ని సృష్టించి, ప్రచారం చేసి భాషా వ్యామోహ ప్రపంచంలో విహరించేలా బహుళజాతి సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు ఇటీవల కాలంలో ముమ్మరమయ్యాయి. ఇది ఒకరకంగా వాటిని అనుమతిస్తున్న ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహమే. 1955, సెప్టెంబర్ 29న ఆంధ్ర రాష్ట్ర శాసన సభలో ప్రభుత్వ వ్యవహారాలన్నీ తెలుగులోనే నిర్వర్తించాలని, ఈ సభ ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నదని వావిలాల గోపాలకృష్ణయ్య తీర్మానం ప్రవేశపెట్టారు. అప్పటి సభాపతి అయ్యదేవర కాళేశ్వరరావు దానిని సవరించారు. అప్పటి నుండి భాషాభివృద్ధి నత్తనడక సాగింది. 1983లో అధికారంలోకొచ్చిన నందమూరి తారక రామరావు తెలుగు అమలులోకి చర్యలు తీసుకున్నారు. సంతృప్తికరమైన ఫలితాలు రాలేదు. 1988 మార్చి 14న ఎన్‌టిఆర్ తెలుగు భాషపై మమకారంతో తెలుగు అమలుపై నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ రెండో తేది నుంచి అన్నీ దస్త్రాలు తెలుగులోనే రావాలని, ఆంగ్లంలో వచ్చిన దస్త్రాలను తిరస్కరిస్తానని అన్నీ స్థాయిల అధికారులకు ఇలానే చేయాలని ఆదేశించారు. అటువంటి కఠినమైన నిర్ణయాల వల్ల పాలనలో తెలుగు అమలయ్యింది. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కఠినమైన నిర్ణయాలు తీసుకొని అమలు చేయలేకపోయాయి. కార్పొరేట్ ప్రైవేటు కళాశాలల్లో జరుగుతున్న మాతృభాషపై దాడిని అరికట్టలేకపోతున్నాయి. ఒక పద్ధతి ప్రకారం సంస్కృత భాషను ప్రవేశపెట్టి తెలుగుకు అన్యాయం చేశారు. విచ్చలవిడి ఆంగ్ల మాధ్యమం పాఠశాలల ఏర్పాటుతో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక అంపశయ్యపై అమ్మ భాష పడుకొని ఉంది. మాతృభాషాభివృద్ధి చర్యలు ప్రభుత్వాలు చేయకపోవడం తెలుగు జాతి చేసుకున్న దురదృష్టం. భాషపై మమకారాన్ని చాటుకునేందుకు ప్రాచీన హోదాని కల్పించినప్పటకీ ప్రపంచీకరణ విష వలయంలో విలవిలలాడుతున్న భాషను రక్షించడంలో మాత్రం పాలకులు విఫలమవుతున్నారు.

తెలుగు భాష వైభవాలను ప్రపంచానికి తెలియజేసి భాష వికాసమే లక్ష్యంగా 1975 ఏప్రిల్ 12 నుంచి 18 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన మొదటి ప్రపంచ మహాసభలు మొదలుకొని 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు తిరుపతి వేదికగా జరిగిన నాల్గొవ ప్రపంచ మహాసభలను మనం ఘనంగా నిర్వహించినప్పటికి భాషాభివృద్ధిలో వెనుకబడున్నాం. నాల్గో ప్రపంచ తెలుగు మహాసభల్లో తొమ్మిది అంశాల్ని చర్చించి తీర్మానించారు. అందులో ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశాల్లో, మనదేశంలో, ఇతర రాష్ట్రాలోనూ ఉన్న తెలుగువారితో భావ సమైక్యాన్ని కలిగించాలని వారిని ఒకేవేదికపైకి తీసుకొచ్చి తెలుగుభాషా సంస్కృతులు ఎదుర్కొంటున్న సాధక బాధకాలను సమగ్రంగా చర్చించి వాటికి పరిష్కారాలు అన్వేషించాలని తీర్మానించారు. అలాగే పాలనా, బోధన ప్రసార మాధ్యమాల భాషగా తెలుగును సమర్థవంతంగా వాడుకలోకి తేవాలని నిర్ణయాలు తీసుకున్నారే గాని అవి ఎంతవరకు సఫలమవుతాయో వేచిచూడాలి. ప్రపంచీకరణలో భాషల్ని, భావాల్ని, ప్రాంతాల్ని, వర్గాల్ని విడగొట్టడమూ ఒక భాగమే. ఇందువల్ల సామ్రాజ్యవాద విధానాలు ప్రజ వ్యతిరేక కార్యకలాపాలు వేగవంతమవుతాయి. వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకొని భారత ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడమే ప్రపంచీకరణ ఏకైక లక్ష్యం. అందుకే భాషాసాహిత్య సంస్కృతుల్ని కాపాడుకోవడం ప్రతి తెలుగువాడి తక్షణ కర్తవ్యం. ప్రపంచీకరణ ఎంత అనివార్యం అయినప్పటికీ భాషా సంగతులను విడగొట్టే ప్రపంచీ కరణను తరిమి కొట్టాల్సిన అవసరం ఉంది. సమాజం ఉన్నంత కాలం క్రియాశీలంగా ఉండే సామాజిక దృగ్గోచర విషయాలలో భాష కూడా ఒకటని సమాజ ఆవిర్భావ అభివృద్ధితో పాటే భాష కూడా ఆవిర్భవించి అభివృద్ధి చెందుతున్నందున సమాజం నశించినప్పుడు మాత్రమే భాష నశిస్తుందని స్టాలిన్ చెప్పినట్టు భాషను సృష్టించి సంరక్షించాల్సింది మనమే. సామ్రాజ్యవాద ఉచ్చులో పడకుండా సామాజిక చైతన్యం దిశగా అడుగులు వేస్తు కార్పొరేట్ క్యాపిటలిజం అంతరించేలా భాషోద్యమం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కెంగార మోహన్
రాష్ట్రఅధ్యక్షులు సాహితీ స్రవంతి

# తప్పిపోయిన అమ్మ భాష

మేలుకో కవీ! ఇకనైనా మేలుకో!
మేలుకొని రాయవెందుకు?
నా భాషోకటి తప్పిపోయిందని
మీరు గానీ చూసారా? అని రాయి
తిరునాళ్ళలో తప్పిపోయిన పిల్లాడిలా
ముక్కుపచ్చలారని నా భాష,
ముత్తయిదువ లాంటి నా భాష,
అమ్మ పొత్తిళ్లలోంచి జారి
ఈ అన్య భాషల ముళ్ల పొదల్లో
ఎక్కడ జారిపోయిందో?
అంటూ రాయవెందుకు?

మేలుకో కవీ!..ఇకనైనా మేలుకో!
పచ్చని పల్లెల్లో
నాగరికత మకిలి అంటని
నూలు గౌను తొడుక్కున్న
అమాయకపు పల్లె పొత్తిళ్ళల్లో
నీ భాష సజీవంగా ఉండే ఉంటుంది
లే వెతికి పట్టుకో
అక్కున చేర్చుకో, గుండెకు హత్తుకో.

ఆంగ్లపు యాసలో
నాగరికత ఊసులో
లిపిస్టిక్ లు అద్దుకుని
తళుకు బెళుకు ల మధ్య
తనది కాని అందాన్ని మోస్తున్న
నీ భాషని నిండారా
నలుగుపిండి పెట్టి కడుగు, పాలరాతి శిల్పంలా ఉండే
స్వచ్ఛమైన నీ భాషని చూడు.

కన్నడిగుడైన కృష్ణరాయలు మెచ్చి,
తమిళుడైన సుబ్రహ్మణ్యభారతి హెచ్చి
ప్రగతి దారుల జగతి మెట్టులెక్కిన భాష
పలుకు తేనియల రస ధారలోలుకు భాష
పలుకుటకు నీకంత కులుకు ఎందుకు?

రాయుటకు నీకంత బెరుకు ఎందుకు?
అసలు నువ్వు కదూ దీనంతటికి కారణం
నీ తల్లి భాషని చిన్న చూపు చూసే
పాలకుల పళ్ళు ఊడగొట్టేలా నాలుగు రాతలు రాసి రాళ్ళల్లా విసరలేవూ?
ఎకసక్కాల ప్రయోగాలు
బూతు రాతల ఇకిలింపులు
విచిత్ర ప్రయోగాల సకిలింపులతో
నీ తల్లి భాషని ఏమార్చి, వెల్ల వెలసిన గోడ లా మార్చిన
సాహితీ ద్రష్టల్ని, నికష్టుల్ని
దునుమాడ ఓ స్వేచ్ఛా గీతాన్ని
నీ కలం సాక్షిగా ఈ కాలం యవనికపై రాగం తీయలేవూ?

నీ చేతకాని తనం కాదా
ఈ నాటి ఈ దురవస్థ
నీ తల్లి భాషకి పట్టిన అవస్థ
99 మార్కుల తెలుగు కన్నా,
100 మార్కుల సంస్కృతం ఏ కావలన్నప్పుడే నువ్ చాచి లెంపకాయ కొట్టి, రెండూ రెండు కళ్ళ వంటివి అని చెప్పలేవూ?

నిద్రపోయింది, నిట్టూర్చింది చాలు లే.. ఇకనైనా మేలుకో!
నాటి తిక్కన్న ని,
నిన్నటి పెద్దన్న ని
గుండెల నిండా ఆవాహన చేసుకుని
నేటి యువ కవి లా నిలబడు
తేట తెలుగుల వెలుగుల్ని చిమ్ము
శ్వాస వంటి భాష మనదని
విశ్వమంతా చాటి చెప్పు
తప్పిపోయిన అమ్మ భాషని
అక్షరాలలో తెచ్చి నిలుపు
ధరణి మురియ సుధలు కురియ
నిక్కమైన తెలుగు కవిలా
అవధరించు విని తరించు
తెలుగు భాషని బ్రతికించు
మేలుకో కవీ!.. ఇకనైనా మేలుకో!

డా. బాశెట్టి లత, తెలుగు అధ్యాపకురాలు,కే. వి. ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.), కర్నూలు.( అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భం గా 21-2-2024.)

# పాలకుల నిర్లక్ష్యం - మాతృభాష ఉనికికే ప్రమాదం

తెలుగు భాషకు అంటే మన మాతృ భాష ఉనికికి వచ్చిన ప్రమాదమేమీ లేదని కొందరు చెబుతుంటే ఎక్కడలేని ధైర్యం వస్తుంది. అదే విషయంపై తెలుగు ఉనికికే ప్రమాదమొచ్చిందని మరి కొందరు చెబుతుంటే అంతే అధైర్యం కలుగుతుంది. ఈ విషయంపై ఈ వైరుధ్యాన్ని జాగ్రత్తగా పరిశీలించి పైన చెప్పిన మొదటి వ్యాఖ్యానాన్ని నిజం చేయవలసిన అవసరం ఎంతో ఉంది. ఇది ఇంట్లో కూచొని చెప్పినంత సులభం కాదు. రంగంలోకి దిగాలి. ఉద్యమాలు చేయాలి. సూచనలు సలహాలు తీసుకోవాలి. పుట్టింది మొదలు మాటలు మాట్లాడే వరకు మన తల్లి భాషే మనకు తెలిసే ఏకైక సమాచార మాధ్యమం. మన ఆచారాలు, అలవాట్లు, బంధాలు అన్నీ తెలుగు భాషతో ముడిపడి పోయాయి. అమ్మా అని మొదట తెలుగులోనే పిలుస్తాము. అలాంటి తల్లి భాషను నిర్లక్ష్యం చేస్తున్నామన్న బాధ చాలామందికి ఉంది కాని ఆ విషయం ఎక్కడ చెప్పాలి.ఎలా చెప్పాలి.ఎవరితో చెప్పాలి. అన్న విషయంలో చాలా సందేహాలున్నాయి. మనం చెప్పిందాన్ని ఎవరూ పట్టించుకోనప్పుడు ప్రజలు చెప్పడం మానేస్తారు. అసలు ప్రజల భాషను కాపాడవలసిన బాధ్యత వారిని పాలించే ప్రభుత్వాలకే ఉంటుంది. అక్కడినుండి సరైన నిర్ణయాలు వస్తే అవి కింది దాకా విస్తరించి తెలుగు భాష జీవించి ఉంటుంది. లేదా యునెస్కో ఇచ్చిన నివేదికలు నిజమవుతాయి.

ఎన్నో ఢక్కామొక్కీలు తింటూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రాంతీయ భాషగా, మాతభాషగా, బోధనా భాషగా, ద్వితీయ భాషగా, అధికార భాషగా ఎన్నో అనుభవాలను చవిచూసింది తెలుగు భాష. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో అసువులుబాస్తున్న ప్రపంచ భాషల్లో ఉంటూ తన ఆయువును తన బిడ్డలే తీస్తుంటే దిక్కుతోచని స్థితిలో ఉందిప్పుడు.

ఒక ప్రాంతంలో అధిక శాతం ప్రజలు మాట్లాడే భాషను అనుసరించి ప్రభుత్వాలు ఆ భాషను ఆ ప్రాంతానికి అధికార భాషగా నిర్ణయిస్తాయి. అనగా, భారతదేశానికి 22 అధికార భాషలు ఉన్నాయి అలాగే భారత ప్రభుత్వం అధికార అవసరాల కొరకు హిందీని, ఆంగ్లాన్ని వాడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు తెలుగు అధికార భాష. ఒక భాషని అధికార భాషగా నిర్ణయంచిన తర్వాత ఆయా ప్రభుత్వాలు అన్ని విధాలా ఆ భాషను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అన్ని ప్రభుత్వ కార్యకలాపాల్లో సాధ్యమైనంతవరకూ ఆ భాషనే ఉపయోగించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1966 మే 14న అధికారభాషా చట్టం చేసింది.

ఇక అధికార భాషగానే కాక ఒక మాధ్యమంగా కూడా తెలుగు భాష కష్టాలనెదుర్కుంటోంది. కొందరికి మాత్రమే అందుబాటులో ఉన్న ఆంగ్ల మాధ్యమ పాఠశాలలన్నీ ప్రయివేటు వారివే. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం పెట్టడం పై చాలా చర్చ జరుగుతోంది. ఇక్కడ సామాజిక న్యాయం ఆవస్యకత కూడా ఉంది. ఐతే బలవంతంగా కాకుండా ఐచ్ఛికంగా ఆంగ్ల మాధ్యమాన్ని ఎంచుకునే వీలు కల్పిస్తే మంచిది. ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణలు ఆంగ్ల భాషను సులభంగా నేర్చుకునేందుకు వీలుగా లేవు. వాటిని అర్థం చేసుకొని పిల్లలకు భోదించే క్రమంలో తేడాలు ఉండనే ఉంటాయి. అదీ కాక ఇంట్లో అమ్మా, నాన్నలు పిల్లలకు వారి చదువులో సహాయపడగలవారు చాలా అరుదు. తెలుగే రాని తలిదండ్రులున్న పిల్లల పరిస్థితి మరీ ఘోరం. ఎంత ప్రపంచీకరణ యుగంలో ఉన్నా ఇప్పటికిప్పుడు ఆంగ్లం నేర్చుకొని చేయగలిగేది ఏమీ లేదు. ఒక నియమిత కాలంలో సరైన ప్రణాళికలు రూపొందిస్తే అది దీర్ఘకాలంలో ఫలితాలనిస్తుంది. స్విగ్గిలోనో అమేజాన్లోనో వస్తువులు తెప్పించుకున్నంత సులభంగా, ఏ క్యాబో తెప్పించుకున్నంత సులభంగా ఈ బోధన చేయలేరు. ఇంగ్లీషోడే భయపడేలా ఆంగ్లం తయారైందిప్పుడు. మాట్లాడే భాష ఒకటి, రాసే భాష ఒకటి ఉంటోంది. ఇంక ఆంగ్లం వ్యాకరణ పరంగా ఏ స్థితిలో ఉందో చెప్పనవసరం లేదు. మొదట మాతృ భాష సరిగా నేర్చుకుంటే దానిద్వారా అన్ని భాషలు తరువాత నేర్చుకోవచ్చు.

ఉమ్మడి రాష్ట్ర నుండి ఇప్పటి దాకా అధికార భాషగా తెలుగు వాడుతున్నారా అని ఒకసారి పరిశీలిస్తే, లేడన్న చేదు సమాధానం వస్తుంది. తెలుగు ఒకటే ఐనప్పటికీ వివిధ యాసలు, సంస్కృతులు గల తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రామాణికమైన తెలుగును వాడగలిగేలా చర్యలు తీసుకోవాలి. ఒక ప్రాంతంలో వాడే పదాలు ఇంకో ప్రాంతంలో వాడితే ఒక్కోసారి అర్థమే మారిపోతున్నది. టైప్‌రైటింగ్ విషయానికి వస్తే అవి అన్ని శాఖల్లో లేవు. ఉన్నా వాటికీ బోర్డు ఒక్కో కంపెనీ సరఫరా చేసే టైపు మిషన్లలో ఒక్కోరకంగా ఉంటోంది. ఇక కంప్యూటర్ల విషయానికి వస్తే ఇంకొన్ని చిక్కులు కలుస్తాయి. ఉద్యోగులకు టైపింగులో పెట్టే ప్రావీణ్య పరీక్షలు ఆంగ్లంలో ఉండడం నిజంగా బాధపడవలసిన విషయం. పరిపాలనా పరంగా వివిధ శాఖల్లో అంతర్గత లేదా బహిరంగంగా సమాచారం ఇచ్చేటప్పుడు ఎక్కువ ఆంగ్లాన్నే వాడుతున్నారు. ప్రజలు తెలుగులో ఇచ్చే అర్జీలకు ఆంగ్లంలో సమాధానాలిస్తున్నారు. పోనీ ఆ ఆంగ్లం సరిగా ఉన్నదా అంటే ఎక్కువ శాతం ఉండదు. అటు మాతృభాష తెలుగులో పట్టు లేక, ఇటు ఆంగ్లమూ సరిగా రాక అవస్త పడుతున్న ఉద్యోగులు ఎందరో ఉన్నారు.

ఈ మధ్య హైకోర్టు తీర్పొకటి తెలుగులో రావడం తప్ప ఇతరత్రా తెలుగు అధికార భాషగా గొప్ప ప్రగతి సాధించిందని చెప్పలేని స్థితి. తల్లి భాషను అభివృద్ధి చేయాలన్న తపన, దీక్ష ఉండి దానిని అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రజలు, మేధావులు కూడా ఈ విషయంలో సంవత్సరానికి ఒకరోజు మాట్లాడడమే కాకుండా సందర్భం వచ్చినప్పుడంతా ఆ

విషయాన్ని ప్రశ్నించవలసిన, చర్చించవలసిన అవసరం ఎంతో ఉంది. అప్పుడే మన తల్లికే తల్లి ఐన తల్లి భాష తెలుగు పది కాలాల పాటు జీవించి ఉంటుంది.

జంధ్యాల రఘుబాబు
- రాష్ట్ర కార్యదర్శి,
సాహితీ స్రవంతి.

## బోధనా రంగంలో మాతృభాష

ఉగ్గు పాలనుండి, ఉయ్యాలలో నుండి అమ్మ పాట పాడినట్టి భాష, తేనె వంటి విందు, వీనులకు విందు, దేశ భాష లందు తెలుగు లెస్స... ...పుట్టినప్పటి నుండి మాతృ మూర్తి పలికిన భాష విద్యా బుద్ధులు నేర్పడానికి అనువయిన భాష మాతృభాష అనడంలో అతిశయోక్తి లేదు. చైనా, బల్గేరియా, నార్వే వంటి అనేక దేశాలలో, భారత దేశంలో అనేక రాష్ట్రాలలో మాతృ భాష లోనే విద్యా బోధన జరుగుతున్నది. అనేక మాండలీకాల సమాహారం ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా పేరు తెచ్చుకున్న తెలుగు భాషను త్రోసి రాజని ఆంగ్లం మన రాష్ట్రంలో అధికారం చెలాయించడానికి కారణాలురెండువందల ఏళ్ల పరాయి పాలన, ప్రపంచీకరణ నేపథ్యంలో ఉద్యోగాల వేటలో మేధోవలస కారణాలు. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆంగ్లంలో తప్ప యే ఇతర భాషలో ఆధునిక బోధనా వసతులు లేక పోవడం, స్వాతంత్రం వచ్చి75ఏళ్ళు దాటుతున్నా, సాంకేతిక విప్లవంకళావచ్చి చాలా కాలమయినా, మాతృ భాష లో తగిన పుస్తకాలు సాఫ్ట్ వేర్ లేకపోవడం యితర కారణాలు. ఇంటర్మీడియట్ ఉన్న ప్రైవేట్ కళాశాలలో భాషకు కు తరగతులు కేటాయించక పోగా, వంద శాతం మార్కుల కోసం మాతభాషను ప్రక్కన పెట్టి కేవలం సంస్కృతం చదవ మనడం హాస్యాస్పదంగా ఉన్నది. భాష సంస్కతినే గాక సంస్కారాన్ని కూడా నేర్పుతుంది. తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రభుత్వాలు మాతృభాషలో విద్యను నేర్చిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుంటే మన తెలుగు రాష్ట్రంలో అనర్హత గా భావిస్తున్నారు. సంగీత, సాహిత్య సంప్రదాయ సంపదలు లేకుంటే అమ్మఅనే పిలుపునే కాదు అమ్మనే మరచి పోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు, అధ్యాపకులు, సాహితీ వేత్తలు యువతను జాగతం చేయాలి.

డాక్టర్ బీవీ.స్వరూప్ సిన్హా, అధ్యాపకులు, మోషన్ కాలేజ్, కర్నూలు.

## ఆంధ్రప్రదేశ్‌లో అరబిక్ భాష ప్రాధాన్యత

అరబిక్ భాష ప్రాముఖ్యత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రాచీన భాషలలో అరబిక్ భాషకు ఒక ప్రత్యేకత ఉన్నది ప్రపంచంలో కెల్లా అతి ప్రాచీన భాష సంస్కృత భాష 5 వేల సంవత్సరాల నుండి ఉన్న భాష అయితే రెండువేల సంవత్సరాల నుండి అరబిక్ భాష ఉన్నదిజ ఇస్లాం యొక్క పవిత్ర గ్రంథం ఖురాన్ అరబిక్ భాషలో ఉన్నందువల్ల ఈ భాషకు ప్రాముఖ్యత ఉన్నది. ముఖ్యంగా అరబుదేశాలలో ఇందనం, పెట్రోలు, డీజలు , బంగారుగనులు లభించడం వల్ల అక్కడ ఉద్యోగరీత్యా ఇతర దేశాల నుండి అరబు దేశాలకు పోయి తమ సంపాదన పెంపొందించుకుంటున్నారు. అందువల్ల మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కూడా వివిధ మతాలవారు ఇంటర్మీడియేట్ లో రెండో భాష అరబిక్‌గా ఎంచుకొని మొత్తం 5000 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే డిగ్రీ కళాశాలలో 500 మంది విద్యార్థులు రెండవ భాష అరబిక్ గా చదువుతున్నారు. అంతేకాకుండా భారత దేశపు పెద్ద పట్టణాలలో మల్టీ నేషనల్ కంపెనీలలో కూడా సాఫ్టువేర్ లలో కూడా పర్ఫెక్ట్‌గా ఉండి అరబిక్ భాషలో కూడా చదివి ఉన్నట్లయితే ఉద్యోగాలలో వారికి ప్రాముఖ్యత లభించును అందువల్ల అరబిక్ భాష చదువుకుంటే అందరూ లాభపడతారు.

డాక్టర్ మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్,
అరబిక్ లెక్చరర్,
కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.